ప్రజాశక్తి

ఆదివారం 21 డిసెంబర్ 2025 — 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి

ఆరోగ్యకరమైన కుటుంబ సంబంధాలు

- సామాజిక స్థిరత్వానికి మూలం
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి

ప్రజాశక్తి - పెడన : ఆరోగ్యకరమైన కుటుంబ సంబంధాలు సామాజిక స్థిరత్వానికి మూలమని, అవి నేరస్తుల్లో సామాజిక వ్యతిరేక ప్రవర్తనలను తగ్గిస్తాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గుట్టాల గోపి పేర్కొన్నారు. కృష్ణాజిల్లా పెడన ఫంక్షన్ హాలో శనివారం కృష్ణా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా పరిపాలనా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యాన నూతన తరహా న్యాయ సేవల శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తితోపాటు జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య, మచిలీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతురాజు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి మాట్లాడుతూ సామాన్యులకు న్యాయం అందుబాటులో ఉంచడం, సాంఘిక దురాచారాల పోరాటంపై ప్రజలకు అవగాహన కల్పించడం, పిల్లల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకుండా దూరమైన వారిని గుర్తించి వారికి చేరువ చేసేలా చర్యలు తీసుకోవడంపై డిఎల్ఎస్ఎ కృషి చేస్తోందన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ పథకాలు పిల్లలకు అనుకూలమైన చట్టపరమైన సేవలు (చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్)పై అదనపు సీనియర్ సివిల్ జడ్జి సిహెచ్ యుగంధర్, మాదకద్రవ్యాల అవగాహన వెల్నెస్ నావిగేషన్‌పై ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ పి సాయిసుధా వివరించారు. వికలాంగులకు ఉపయోగపడే వినికిడి పరికరాలు, ముగ్గురు లబ్ధిదారులకు బ్యాటరీ ట్రైసైకిళ్లు అందజేశారు. 14 మంది ఎస్టీ లబ్ధిదారులకు గొర్రెల పెంపకం కోసం రూ.6.30 లక్షల చెక్కును అందించారు. అదేవిధంగా 20,670 మంది డ్వాక్రా సంఘాల సభ్యులకు స్త్రీ నిధి నుంచి రూ.143.94 కోట్ల జీవనోపాదుల రుణాల చెక్కును, 9,458 స్వయం సహాయక సంఘాలకు రూ.726.43 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కును లబ్ధిదారులకు అందించారు.

ఉపాధి హామీ చట్ట సవరణ వద్దు

- ధర్నాల్లో ప్రజాసంఘాల నేతల డిమాండ్
- పలుచోట్ల ప్రతులు దహనం

ప్రజాశక్తి - విజయవాడ : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో జాతిపిత మహాత్మాగాంధీ పేరు మార్పు చేసి పార్లమెంట్లో పెట్టిన బిల్లును బిల్లును ఉపసంహరించుకోవాలని కోరుతూ శనివారం యన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో పలుచోట్ల ఆందోళనలు నిర్వహించారు. ధర్నాలు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. మరికొన్ని చోట్ల చట్ట సవరణ బిల్లు ప్రతులను దహనం చేశారు. విజయవాడలోని జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయా ప్రజాసంఘాల రాష్ట్ర, జిల్లా స్థాయి నేతలు జిల్లా డిఆర్ఓ లక్ష్మీనరసింహాకు వినతిపత్రం అందజేశారు. 2025 ఉపాధి హామీ చట్టం బిల్లును ఉపసంహరించుకోవాలని, ఎంజిఎన్ఆర్ఇజిఎస్‌ను పునరుద్ధరించాలని, ఉపాధి కార్మికుల పొట్టకొట్టొద్దని, కేంద్రంలోని మోడీ-బిజెపి చర్యను వ్యతిరేకించాలని కోరుతూ నాయకులు, కార్యకర్తలు పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈసందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.శివనాగరాణి మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీచట్టం-2005ను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రద్దుచేసేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు. సిఐటియు యన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి యన్.సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీని హత్యచేసిన గాడ్సే వారసులు గాంధీజీ పేరు స్థానంలో రాంజీ పేరు పెట్టి ఉపాధి హామీ చట్టం స్ఫూర్తిని దెబ్బతీసేందుకు చేస్తున్న





విజయవాడ కలెక్టరేట్ ఆవరణలో ధర్నా చేస్తున్న నేతలు: డిఆర్ఒకు వినతిపత్రం (అంతర్‌చిత్రం)

ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. రైతు సంఘం యన్టీఆర్ జిల్లా కార్యదర్శి పి.వి.ఆంజనేయులు మాట్లాడుతూ 2005 చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఈ చట్టానికి 90 శాతం నిధులు కేటాయిస్తే ,రాష్ట్రాలు కేవలం 10శాతం మాత్రమే కేటాయించాల్సి ఉంటుందన్నారు. అయితే నేడు మోడీ తీసుకొస్తున్న సవరణల ప్రకారం కేంద్రం 60 శాతం, రాష్ట్రాలు 40 శాతం భరించాల్సి ఉంటుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం యన్టీఆర్ జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టంలో ఏడాదిలో ఎప్పుడైనా పని పొందే హక్కు ఉందన్నారు. కానీ నేడు వంద రోజులు పని గ్రామీణ పేదలు కోరినప్పుడు కాకుండా ప్రభుత్వం నోటిఫై చేసిన ప్రాంతాలలో 60 రోజులు ఉపాధి పని చేయడానికి వీలులేదని మార్పు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిధులు పెంచాలనే గ్యారెంటీ ఇవ్వకుండా, ఈ చట్టాన్ని పథకంగా మార్చి చట్టం స్ఫూర్తినే రద్దుచేసిందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు విజయవాడ సెంట్రల్ సిటీ ప్రధాన కార్యదర్శి కె.దుర్గారావు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి యన్.సిహెచ్ సుప్రజ, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి వెంకటేశ్వరరావు, సిఐటియు విజయవాడ తూర్పు కార్యదర్శి యన్.నాగేశ్వరావు, విజయవాడ సెంట్రల్ సిటీ నాయకులు వై.సుబ్బారావు, సోమేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం యన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వి.నాగరాజు, పానెం ఆనందరావు, రుక్మిణీ, ఏసుపాదం, ముగడా సురేసు, సట్టు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కృష్ణాజిల్లా బంటుమిల్లిలో బిల్లు ప్రతులు దహనం చేస్తున్న నేతలు

గంజాయి మత్తులో యువత

- అమాయకులపై దాడులు
- చోద్యం చూస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- నందిగామ : గంజాయి బ్యాచ్ రెచ్చిపోతోంది. అమాయికులపై దాడులకు పాల్పడుతోంది. సదరు గంజాయి బ్యాచ్‌పై కేసులు నమోదైనా తీరు మారటం లేదు. ఎన్టీఆర్ జిల్లా నందిగామలో కొందరు వ్యక్తులు గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం ఉంది. నందిగామ రైతుపేట డౌన్, విజయటాకీస్ సెంటర్, డివిఆర్ కాలనీ, పాత బస్టాండ్, గాంధీ సెంటర్, భారత్ టాకీస్ సెంటర్, మయూరి సెంటర్, ఎల్‌వీ సెంటర్ తదితర ప్రాంతాల్లో కొందరు గంజాయి సేవించి అమాయికులపై దాడులకు పాల్పడుతున్నారు. ట్రాఫిక్ రద్దీగా ఉండే ప్రాంతాల్లో గంజాయి బ్యాచ్ మత్తులో మహిళల మెడలో బంగారు చెయిన్లు కూడా తెంచుకుని పరారవుతున్నారు. ఇటీవల కాలంలో రామన్నపేట రోడ్డులో ఓ మహిళా మెడలో బంగారు నాంతాడు తెంచుకుని పరారయ్యారు. అలాగే చందర్లపాడు రోడ్డు కెవిఆర్ కళాశాల సమీపంలో ఓ వృద్ధురాలి మెడలో బంగారు గొలుసులను తెంచుకుని పరారయ్యారు. నందిగామలో కూడా గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న ముఠాను ఇటీవల నందిగామ ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నందిగామలో గత ఏడాది సుమారు 480 గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మత్తుపదార్థాలు సరఫరా చేస్తున్న గంజాయి బ్యాచ్ మత్తులో మహిళలు, వృద్ధులతో అకారణంగా గొడవలు పెట్టుకుని భౌతికదాడులకు దిగుతున్నారు. నందిగామ పాత బైపాస్ రోడ్డు, చందాపురం, డివిఆర్ కాలనీ, అనాసాగరం అండర్‌పాస్, అంబారుపేట వై జంక్షన్ వద్ద, 65వ నంబరు జాతీయ రహదారి పక్కనే ఆకతాయిలు మద్యం తాగుతూ, గంజాయి సేవిస్తూ మత్తులో జోగుతున్నారు. జాతీయ రహదారిపై వెళ్లే వాహనదారులకు, ట్రాఫిక్‌కు అవాంతరాలు కల్పిస్తున్నారు. పోలీసులు డ్రోన్ కెమెరాల ద్వారా మత్తులో జోగుతున్న యువకుల కోసం వెంటాడుతున్నా ఆకతాయిలు వాటిని చూసి వాటికి కనిపించని ప్రదేశాల్లోకి జారు కుంటున్నారు.

పోలీసులకు సవాల్‌గా మారిన గంజాయి బ్యాచ్

గంజాయి బ్యాచ్‌లను నియంత్రించడం పోలీసులకు సవాల్‌గా మారింది. నందిగామలో ఇటీవల కాలంలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న వారిని పట్టుకోవడం పోలీసులకు ఛాలెంజ్‌గా మారింది. విశాఖ, విజయవాడ నుండి నందిగామకు గంజాయి ప్యాకెట్లు గుట్టుచప్పుడు కాకుండా రవాణా అవుతున్నాయని సమాచారం. గతంలో వందల కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు.



పోలియోపై అప్రమత్తత అవసరం

కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సమష్టిగా అడుగులు వేస్తూ స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఈ క్రమంలో ఆరోగ్య ఆంధ్ర సాకారానికి కృషిచేద్దామని, పోలియో అంతమొందినా అప్రమత్తంగా ఉంటూ అయిదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయిద్దామని అన్నారు. విజయవాడ ఓల్డ్ జీజీహెచ్ వద్ద జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం పల్స్ పోలియో ర్యాలీని కలెక్టర్ లక్ష్మీశ.. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్.ఎం, రోటరీ, లయన్స్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తదితర సంస్థల ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో పోలియోను అంతమొందించినట్లు చెప్పారు. అయితే ముందు జాగ్రత్తగా చిన్నారులకు ఆరోగ్యకరమైన బంగారు భవితను అందించాలనే ఉద్దేశంతో అప్రమత్తంగా ఉంటూ పల్స్ పోలియో కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 21న బూత్ స్థాయిలోనూ, ఈనెల 22, 23వ తేదీల్లో ఇంటింటి సర్వే ద్వారా చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు చెప్పారు. వైద్య ఆరోగ్యం, రెవెన్యూ, పంచాయతీరాజ్, మునిసిపల్, ప్రజా రవాణా, ఐసీడీఎస్ తదితర శాఖల అధికారుల సమష్టి కృషితో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. 611 గ్రామీణ బూత్‌లు, 355 అర్బన్ బూత్‌లు, 71 మొబైల్ బందాలు, 35 ట్రాన్సిట్ పాయింట్ల ద్వారా ప్రత్యేక బందాలు సేవలందిస్తాయన్నారు. బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు తదితర చోట్ల కూడా పాయింట్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఏ ఒక్కరూ మిగిలిపోకుండా 100 శాతం ఇమ్యునైజేషన్ జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, డా. హనుమయ్య (ఐఎంఏ), డా. శ్రీదేవి, డా. శరత్ (ఐఏపీ), డా. చిలకపాటి రామ్ చంద్, డా. శ్యాం ముప్వ, డా. బోడేపూడి హనుమయ్య పాల్గొన్నారు.



ర్యాలీలో కలెక్టర్ జి.లక్ష్మీశ తదితరులు



చీరలు పంపిణీ చేస్తున్న పాపులర్ షూమార్ట్ అధినేత చుక్కపల్లి అరుణ్‌కుమార్

దళితులు, బిసిలు ఐక్యంగా ఉండాలి

మాజీ మంత్రి వడ్డే

విజయవాడ : దేశంలో దళితులు, బిసిలు, మైనారిటీలపై దాడులు పెరిగిపోతున్నాయని, కుల వివక్ష కొనసాగుతోందని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడ వించిపేట సిఎస్ఐ చర్చి ఆవరణలో దేశవ్యాప్తంగా దళితులు, ఆదివాసీ గిరిజనులు, మైనార్టీ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎపిడిజెఎస్ ఆధ్వర్యాన శనివారం కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షులు కంకిపాటి అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వడ్డే ముఖ్య అతిథిగా మాట్లాడుతూ దళితులు, బిసిలు, మైనారిటీలపై దాడులు 2021తో పోలిస్తే 15 శాతం పెరిగాయన్నారు. ఏలూరు, ప్రకాశం జిల్లాల్లో దళితులపై దాడులు జరిగాయని, ఇవి అమానుషమని అన్నారు. ప్రభుత్వాలు స్పందించి నిందితులకు కఠినంగా శిక్షించాలని కోరారు. పలువురు వక్తలు మాట్లాడుతూ దళితులు, బిసిలు ఐక్యంగా బలమైన శక్తితో పోరాడాలని అన్నారు. మరో ముఖ్య అతిథి, పాపులర్ షూమార్ట్ గ్రూప్ సంస్థల చైర్మన్ చుక్కపల్లి అరుణ్ కుమార్ పాల్గొని మహిళలకు, వృద్ధులకు తమ సంస్థ నుండి చీరలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో సిపిఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు, టిడిపి నాయకులు పేటేటి రాజశేఖర్, దళిత నాయకులు కండెల విజయ్ కుమార్, రెవరెండ్ కరుణానిధి, దైవజనులు కంకిపాటి జాన్ ఆనంద్ కుమార్, చర్మ కార్మిక సంఘం నాయకులు పల్లికంటి నాగేశ్వరరావు, అనకాపల్లి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.



ఐఎంఎ హాలులో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న వైద్యులు

ఐఎంఎ ఆధ్వర్యాన సెమీ క్రిస్మస్ వేడుకలు

విజయవాడ : నగరంలోని ఐఎంఎ హాలులో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఐఎంఎ విజయవాడ నగర అధ్యక్షుడు డాక్టర్ నాగ వరప్రసాద్, కార్యదర్శి డాక్టర్ అనురూప్ తోట క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో కోశాధికారి డాక్టర్ వంశీ, ఉపాధ్యక్షులు డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్, బోడేపూడి చౌదరి, సంయుక్త కార్యదర్శులు డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ పూజిత, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. డాక్టర్ సోనీలాల్ పర్యవేక్షణ చేశారు.

అలరించిన 'సినీ గీతం - బాలు గళం'

విజయవాడ : గాన గంధర్వుడు, "పద్మవిభూషణ్ " ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహాన్ని హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్రతిష్ఠించిన సందర్భాన్ని పురస్కరించుకుని 'డ్రీమ్ ఆడియో' చావా నరసింహారావు స్థానిక గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై "సినీ గీతం – బాలు గళం" పేరిట సంగీత విభావరి నిర్వహించారు. బాలు పాడిన పలు సినీ గీతాలను సత్యవర్ధన్, వసంత్ కుమార్, జి.శ్రీనివాసులు, విష్ణుప్రియ, బొబ్బిలి మల్లేశ్వరి, డా. అమలారాణి, రాజ్యలక్ష్మి ఆలపించి శ్రోతలను అలరించారు. సౌండ్స్ : నరేష్. శాతవాహన కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమా సత్యనారాయణ, డా.పరుచూరి విజయలక్ష్మి, ప్రసూనా రామన్ , కె.డేవిడ్ రాజు, నడకుదుటి ఝాన్సీ, బి.వి.వీరభద్ర రావు, ఎ.వి.రమణ, తొట్టెంపూడి రమేష్ పాల్గొన్నారు.



ఫిబ్రవరిలోగా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి


●జిల్లా ఖజానా లెక్కల అధికారి రవి ●డివిజనల్ ఉప ఖజానా కార్యాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

విజయవాడ : ఉద్యోగ విరమణ పొందిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కుటుంబ పింఛనుదారులు వార్షిక జీవన ప్రమాణ ధవీకరణ పత్రాన్ని ఫైనాన్స్ డిపార్టెంట్, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి సంవత్సరం జనవరి 1 నుండి ఫిబ్రవరి నెలాఖరులోగా సమర్పించాలని జిల్లా ఖజానా లెక్కల అధికారి ఏ.రవి ఒక ప్రకటనలో తెలిపారు. పింఛనుదారులు తమ వార్షిక జీవన ప్రమాణ ధవీకరణ పత్రాన్ని 'జీవనప్రమాణ్' పోర్టల్ ద్వారా కానీ, పింఛనర్ల వక్తిగత సిఎఫ్ఎమ్ఎస్ లాగిన్ ద్వారా కానీ, ఏదైనా ఖజానా కారాలయంలోగానీ సమరించ వచ్చని పేర్కొన్నారు. ఇందుకు పెన్షనర్ల ఆధార్ నెంబర్, మొబైల్ నెంబర్ (ఓటీపీ కొరకు), పిపిఒ నెంబర్, బాంకు అకౌంట్ నంబర్లు సరిచూసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి నెలాఖరులోగా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించకపోతే ఏప్రిల్ ఒకటో తేదీన ఇచ్చే మార్చి నెల పెన్షన్ నిలిచిపోతుందని తెలిపారు. ఈనేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా పరిధిలో డివిజినల్ ఖజానా కార్యాలయం, విజయవాడ (తూర్పు)లో ప్రత్యేక కౌంటర్లు అందుబాటులో ఉంచామని తెలిపారు. అలాగే ఉప ఖజానా కార్యాలయాలైన నందిగామ, జగ్గయ్యపేట, కంచికచర్ల, మైలవరం, తిరువూరు, విస్సన్నపేటల్లోనూ అందుబాటులో ఉంచామని తెలిపారు. ఉప ఖజానా కార్యాలయాలలో కూడా పింఛనుదారులు తమ లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించవచ్చని తెలిపారు. ఏమైనా సందేహాలు ఉంటే సంబంధిత ఖజానా కార్యాలయాల అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవచ్చునని విజ్ఞప్తి చేశారు.



ఉల్లాసంగా 'సురభి కళా వేదిక' కచేరీ

విజయవాడ : క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా శనివారం రాత్రి "మహా గాయకుల మధుర గీతాలు.. తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి" (కరోకే) జరిగింది. గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై 'సురభి కళా వేదిక' వ్యవస్థాపకులు, గాయకులు కామినేని ఉమాశంకర్ నిర్వహణలో ఉల్లాసంగా జరిగిన కార్యక్రమంలో సుమలత, మీనాకుమారి, వెంకటేష్, డి.చంద్రశేఖర్, ఎస్,నాగేంద్రరావు, రంజానీ తదితర ఔత్సాహిక గాయనీ గాయకులు పలు తెలుగు, హిందీ సినిమాల్లోని సోలో, యుగళ గీతాలు పాడి ప్రేక్షకుల్ని అలరించారు.



ఘనంగా చిన్నయ్య సూరి జయంతి

విజయవాడ : ప్రముఖ తెలుగు వ్యాకరణకర్త, మహా పండితుడు పరవస్తు చిన్నయ సూరి 219వ జయంతి కార్యక్రమం శనివారం సాయంత్రం విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ మందిరంలో టీ శోభనాద్రి అధ్యక్షతన ఘనంగా జరిగింది. మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ చిన్నయ సూరి జయంతి కార్యక్రమం ప్రభుత్వమే నిర్వహించేలా తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. తెలుగు భాష ఉన్నంతవరకూ చిన్నయ సూరి గుర్తుంటారని నివాళులర్పించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న శ్రీరామానుజ ఫిలసాఫికల్ ట్రస్ట్ చైర్ పర్సన్ బెల్లంకొండ పద్మావతి ప్రసంగిస్తూ సాహితీ పీఠానికి తమ ట్రస్ట్ తరపున ఏటా ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇంకా సాహితీవేత్తలు గుమ్మా సాంబశివరావు, డాక్టర్ జి వి పూర్ణచందు, అనిల్ కుమార్ సూరి, రాకేష్ విద్యాసంస్థల డైరెక్టర్ ఎన్వీ రావు, తిరుశ్రీ, రాంప్రసాద్, వై.కేశవాచార్యులు, ఏవీఎస్ఎన్ ప్రసాద్, టి.మురళీకష్ణ పాల్గొన్నారు.

సబ్ స్టేషన్లో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - విజయవాడ : అజిత్ సింగ్‌నగర్ కార్యాలయంలో ఏఈ డి.కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా ఎన్‌టిఆర్ జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ యు.హనుమయ్య పాల్గొని క్రిస్మస్ ప్రాధాన్యతను వివరించారు. ఈకార్యక్రమంలో ఏడీ ఈ గోవింద రాజులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఆధ్యాత్మిక సంగీత విభావరి

విజయవాడ : క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ఏవీఎం చారిటీస్ ఇండియా సౌజన్యంతో "ఇవి క్రిస్మస్ శుభాకాంక్షలు" మకుటంతో స్థానిక గాంధీనగర్ వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో ఆధ్యాత్మిక సంగీత విభావరి జరిగింది. ప్రిన్స్ మెలోడీస్ నిర్వహణలో ఫుల్ లైవ్ ఆర్కెస్ట్రాతో జరిగిన విభావరిలో వి.ప్రిన్స్, ఆదిరాల జయప్రభు, (రాజమండ్రి)రాజకుమారి, రితిక, సద్గుణ, స్వరూపరాణి, ఆదిరాల బాల పధ్వీరాజ్ తదితర సువార్త ఔత్సాహిక గాయనీ గాయకులు ఆధ్యాత్మిక గీతాలతో ప్రేక్షకుల్ని అలరించారు.



బందరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



కోడూరులో...

పల్స్‌పోలియో విజయవంతం చేయాలని ర్యాలీలు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : పోలియోచుక్కలు చిన్నారుల భవిష్యత్తును కాపాడతాయని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి. యుగంధర్ అన్నారు. డిఎం అండ్ హెచ్ఓ కార్యాలయం నుంచి పల్స్ పోలియో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్య భవిష్యత్తును దష్టిలో పెట్టుకుని 5. ఏళ్ళ లోపు వయస్సు ఉన్న ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని అన్ని గ్రామాల్లో ఆదివారం ప్రత్యేక పల్స్ పోలియో టీకా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లలో ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలియో చుక్కలు వేస్తామని చెప్పారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను తప్పనిసరిగా పోలియో బూత్‌లకు తీసుకువచ్చి చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు. డీఐఓ డా. ప్రేమ్ చంద్, ఏఓ సురేష్, ప్రోగ్రాం అధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోడూరు : అప్పుడే పుట్టిన బిడ్డ వద్ద నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా తల్లిదండ్రులు పోలియో చుక్కలు వేయించాలని కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిని రాణి సంయుక్త సూచించారు. కోడూరు పిహెచ్సి వైద్య సిబ్బందితో కలసి ర్యాలీ నిర్వహించారు. పిహెచ్సి హెల్త్ అసిస్టెంట్ మస్తాన్రావు పీహెచ్సీ సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, సచివాలయాలలో పల్స్ పోలియో ర్యాలీలు శనివారం నిర్వహించారు. ఈనెల 21 వ తేదీ ఆదివారం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు తెలిపారు. డాక్టర్ ఎం యశస్విని, డాక్టర్ టి. ప్రవీణ, సూపర్ వైజర్స్, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** 5సం॥ల లోపు పిల్లలకు తప్పని సరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. శనివారం స్థానిక ఎజికె స్కూల్ వద్ద నుండి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పల్స్ పోలియో అవగాహన ర్యాలీ నిర్వహిం చారు. ఆర్‌డివో జి బాలసుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్, తాశీల్ధార్ కిరణ్, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఉపాధ్యక్షుడు గోకవరపు సునీల్, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-పామర్రు :** రెండు చుక్కల పోలియో మందు నిండు జీవితానికి రక్షణగా ఉంటుందని పామర్రు ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ టి.రాజేష్ అన్నారు. పామర్రు పురవీధుల వెంట బ్యానర్లు ప్లే కార్డులను పట్టుకుని పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం అంటూ నినాదాలు ఇస్తూ ప్రచారం చేశారు. సూపర్వైజర్లు విజయ సారథి,వేణుగోపాల వరప్రసాద్,వైద్య సిబ్బంది ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : సత్య హాస్పిటల్, మచిలీపట్నం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కోర్టు సముదాయాల ప్రాంగణంలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంను కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి జి గోపి ప్రారంభిం చారు. ఉచిత మెగా మెడికల్ క్యాంపును న్యాయవాదులు కోర్టు సిబ్బంది తదితరులు వినియోగించుకున్నారు. సత్య హాస్పిటల్ డాక్టర్ సత్య ఫణింద్ర ఉచిత మెగా వైద్య శిబిరానికి వచ్చి న వారిలో బోన్ మినరల్ డెన్సిటీ టెస్ట్ నిర్వహించారు.

పలువురికి పరామర్శ

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలను శనివారం మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జి సింహాద్రి రమేష్ బాబు పరామర్శించారు. గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు గొర్రెపాటి మధుసూదనరావు, వార్డు సభ్యులు వేమూరి రాజబాబు, పీఏసీఎస్ మాజీ ఛైర్‌పర్సన్ వేమూరి రత్నశేఖర్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న సింహాద్రి రమేష్ బాబు, వారి నివాసాలకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారికి ధైర్యం చెప్పి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు వేమూరి వెంకట్రావు, యూత్ కన్వీనర్ వేమూరి ప్రవీణ్, పార్టీ నేతలు గొర్రెపాటి జగన్మోహనరావు, గొర్రెపాటి గోపాలరావు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక లయన్స్ సేవా భవనంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. లయన్ కొల్లి రాజేష్ అదే సహాయంతో కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 14 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించి వారికి బొమ్ములూరు లయన్స్ కంటి ఆసుపత్రి లో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు లయన్ జిల్లా మాజీ గవర్నర్ వైపిసి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పెరుమల్లు, ఈద కొండయ్య లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

4న సిఐటియు మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-గన్నవరం (ఉంగుటూరు) : విశాఖపట్నం లో డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు జరగనున్న సిఐటియు. అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టి వి లక్ష్మణస్వామి అన్నారు. ఉంగుటూరు మండల కేంద్రంలో మానికొండ సూర్యావతి కార్మక భవనంలో సిఐటియు మండల కన్వీనర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో లక్ష్మణస్వామి మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని, కార్మిక హక్కులను హరించి శ్రమ దోపిడీ లేబర్ కోడ్ లను రద్దు చేయాలనే ప్రధాన అంశాలుగా ఈ మహాసభలలో చర్చ జరుగుతుందన్నారు. బహిరంగ సభలో మండలం లోని కార్మికులు అంతా పాల్గోనాలని కోరారు. వ్యవసాయ కార్మక సంఘం నాయకులు అజ్మీరా వెంకటేశ్వరరావు, రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు మాగంటి సాంబ శివరావు, సలీం, మధ్యాహ్న భోజన పథకం సంఘం నాయకులు మహాభూబీ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టివి లక్ష్మణస్వామి



సెయింట్ జోసఫ్‌లో ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శనలు

ప్రజాశక్తి-గన్నవరం : మండలంలోని ముస్తాబాదలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో శనివారం కళా, విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించిన వివిధ ప్రాజెక్టులు అతిథులను ఆకట్టుకున్నాయి. సైబర్ భద్రత, కత్రిమ మేధస్సు (ఎఐ), వాతావరణ మార్పు, గ్లోబల్ వార్మింగ్, సౌరశక్తి వ్యవస్థ, ఆహారం, జల వనరుల సంరక్షణ, లాభదాయక వ్యవసాయం, శరీర అవయవాలు (జీర్ణాశయం, మూత్రపిండాలు), దంత ఆరోగ్యం, భాషాభాగాలు, గణిత కార్యకలాపాలు వంటి వివిధ అంశాలపై ప్రాజెక్టులు ఈ ప్రదర్శనలో చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సెయింట్ జాన్స్ పాఠశాల ప్రధానాచార్యులు రెవరెండ్ బ్రదర్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ వినడం, మాట్లాడడం, రాయడం అనే నాలుగు నైపుణ్యాలలో ప్రతి విద్యార్థి ప్రావీణ్యం సాదించాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ మిస్టర్ పరిమళ, కరెస్పాండెంట్ సిస్టర్ టీనా, ఫాదర్లు బోయల బాలాజీ, కే. జోసెఫ్, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రదర్శన అనంతరం, పాఠశాల వార్షిక సెమీ-క్రిస్మస్ వేడుకను విద్యార్థులు ఘనంగా నిర్వహించారు.

పంచాయతీల బలోపేతానికి గ్రామస్వరాజ్ దోహదం : ఎంపిడిఒ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గ్రామ పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు జాతీయ గ్రామ స్వరాజ్ అభియాన్ దోహదపడుతుందని ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ అన్నారు. గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయ మీటింగ్ హాల్‌లో శనివారం జాతీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యాచరణ ప్రణాళిక-2025-26లో భాగంగా కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్స్ అంశంపై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ,పంచాయతీలను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడమే ఈ శిక్షణా కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని ఎంపీడీఓ ఇమ్రాన్ అన్నారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీల సొంత వనరుల ఆదాయాలను పెంపొందించడంపై పంచాయతీ స్థాయి అధికారులకు సమగ్ర అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందరరేగా ఆస్తి పన్ను, నీటి పన్ను, డ్రైనేజ్ పన్ను, వ్యాపార లైసెన్సులు, బహిరంగ ప్రదేశాల వినియోగ రుసుములు, మార్కెట్ల అద్దెలు, ఇతర స్థానిక ఆదాయ మార్గాలపై విస్తతంగా వివరించామన్నారు. డిప్యూటీ ఎంపీడీవోలు జి.యస్.యస్.అంజనాదేవి, వి.ఎలీషారావు తదితరులు పాల్గొన్నారు.





చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

- రూ.4.5 లక్షల విలువైన సొత్తు రికవరీ



స్వాధీనం చేసుకున్న బైక్‌లు

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో వరుస ద్విచక్రవాహనాల దొంగతనాలు, ఇంటి దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డిఎస్‌సి వి ధీరజ్ వినీల్ తెలిపారు. శనివారం రాత్రి గుడివాడ తాలూకా పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ గుడివాడ రూరల్ మండలం మల్లాయిపాలెం పరిధిలోని టిడ్కో కాలనీ వద్దడ ఎస్ఐ ఎన్ చంటిబాబు నేతృత్వంలో పోలీస్ బృందం తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించిన ఇద్దరు అనుమానితులు టిడ్కో కాలనీకి చెందిన పెమ్మిశెట్టి రామ ప్రకాష్ అలియాస్ రామ ప్రకాష్, నైజాం పేటకు చెందిన అబుబాకర్ బేగ్ అలియాస్ అబులను అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. ఈ విచారణలో ఈ ఏడాది నవంబర్, డిసెంబర్ నెలలలో గుడివాడ, లక్ష్మీనగర్ కాలనీ, టిడ్కో కాలనీ, బొమ్ములూరు, గుడ్లవల్లేరు ప్రాంతాల్లో ఇంటి దొంగతనాలు, 5 మోటార్ సైకిళ్ళు చోరీ చేసినట్లు అంగీకరించారన్నారు. వారినుండి మొత్తం రూ.4,50,000లు విలువ గల 2 బంగారు చెవి దిద్దులు, 5 మోటార్ సైకిళ్ళు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సిఐ ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు, ఎస్ఐ ఎన్ చంటిబాబు, ట్రైనీ ఎస్ఐ లోకేశ్వరి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి-పమిడిముక్కల : గుడివాడ డిఎస్‌పి వీనిల్ ధీరజ్ శనివారం వీరంకిలాకు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలు తగ్గే విధంగా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌తో రికార్డులు పరిశీలించారు. పమిడిముక్కల సీఐ చిట్టిబాబు, ఎస్సై శ్రీను పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-పామర్రు : బాల్య వివాహాలతో పలు సమస్యలు వస్తాయని పామర్రు ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎం సత్యశ్రీ అన్నారు. పామర్రు శివారు కంచర్ల అనుపురంలో బాల్యవివాహాల నిర్మూలనపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కిషోర్ బాలికలు మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ వివాహాలు చట్ట వ్యతిరేకమని, ప్రోత్సహించిన వారిపై చర్యలు ఉంటాయని అన్నారు. అదేవిధంగా మండల పరిధి అడ్డాడలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో బాల్యవివాహాల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ మెంబర్ భవాని, ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి ఘంటసాల : నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో ఆరోగ్య కేంద్రాల నిర్మాణం చేపడుతున్నట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. శనివారం ఘంటసాల మండలంలోని లంకపల్లి, చిట్టూర్పు, తెలుగురావుపాలెం, పాపవినాశనం గ్రామాల్లో ఒక్కొక్కటి రూ. 36 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన ఆరోగ్య కేంద్ర భవనాలకు ఆయన శంకుస్థాపన చేసి, శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాపవినాశనంలో జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో నిధుల కొరతతో అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఆరోగ్య కేంద్రాలకు ఇప్పుడు శాశ్వత పరిష్కారం లభిస్తోందన్నారు.ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, టీడీపీ మండల అధ్యక్షులు తుమ్మల చౌదరిబాబు, డీసీ చైర్మన్ అయినపూడి భానుప్రకాష్, నేతలు పరుచూరి సుభాష్ చంద్రబోస్, తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), ఆయా గ్రామాల సర్పంచులు దున్నా విజయలక్ష్మి, గూడపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : 53వ డివిజన్లలో నూర్‌ఉల్ హాక్ (డ్రైన్ వీధి)లో రూ. 8 లక్షల వ్యయంతో ఐరన్ మెష్, పంచముఖ ఆంజనేయ స్వామి గుడి వద్ద బావిపంపుల ప్లాట్ఫారం, కాలువ నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జన సేన పార్టీ ఇంచార్జీ పులిచేరి రమేష్, తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు నందీటి విజయలక్ష్మి, నందిపాటి నరసింహారావు, కంచి బాబు, కాజ, రవి, సోలజర్, సమీర్ పాల్గొన్నారు.

ముగిసిన ధర్మకర్తల మండలి పదవీ కాలం

ప్రజాశక్తి- విజయవాడ సిటీ : విజయవాడ వన్‌టౌన్ శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం(పాత శివాలయం)లో శనివారం దేవస్థానం ధర్మకర్తల మండలి పదవీకాలం పూర్తయిన సందర్భంగా దేవస్థానం వారిచే విలేకరి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈవో నటరాజ్ షణ్ముగం, చైర్మన్ బొమ్ము మధు మాట్లాడుతూ రెండేళ్ల కాలంలో దాతల సహాయంతో పూర్తి చేసిన పాతశివాలయం అభివృద్ధి పనుల గురించి తెలిపారు. సుమారు 4 లక్షల రూపాయల నిధులతో ఆలయ అర్చకులు నాగరాజు శర్మ, దాతల సహకారంతో అమ్మవారి ఆలయానికి లోపల బయట ఇత్తడి తాపడం ఏర్పాటుతోపాటు ఉత్సవ మూర్తులు, ఉత్సవ మూర్తుల గదిని ఏర్పాటు చేయడం జరిగిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు రాంపిళ్ళ వాసు, నాగోతి గురు రామ్ ప్రసాద్, చంద్ర శేఖర్, నాగోతి విజయ నిర్మల, కామినేని కోమల, వేలాడి శాంతి , ఏనుగుల దుర్గా భవాని, జూలూరు సౌజన్య, లక్ష్మి, ఆలయ అర్చకులు రాచకొండ నాగరాజుశర్మ , అభిషేకపండిత్ కొత్తపల్లి సాయి కష్ణ శర్మ , సహాయక నాదెళ్ళ లక్ష్మి రాఘవేంద్ర శర్మ పాల్గొన్నారు.



ఘనంగా కెరీర్ ఫెస్ట్

ప్రజాశక్తి -మైలవరం : జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా, విద్యాశాఖ అధికారి చంద్రకళ, అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎం రజనీకుమారిల పర్యవేక్షణలో శనివారం స్థానిక లక్కిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన జిల్లా స్థాయి కెరీర్ ఫెస్ట్, ఎక్స్పోబి2025ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిసి డివో బి.విశ్వభారతి మాట్లాడుతూ విద్యార్థులు మార్కులకే పరిమితం కాకుండా తమ ఆసక్తులు, నైపుణ్యాలు వ్యక్తిత్వాన్ని గుర్తించి సరైన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. యూనిసెఫ్ కన్సల్టెంట్ సమగ్ర శిక్షకులు జి ప్రియాంక మాట్లాడుతూ కెరీర్ ఫెస్ట్‌లు నిర్వహించటం వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి లక్ష్యసాధనకు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మెంటల్ హెల్త్ అండ్ కెరీర్ గైడెన్స్ కౌన్సిలర్సు, విద్యాశాఖ అధికారులు రాజు, బాలు, ఎస్ఐ సుధాకర్, పాల్గొన్నారు.

23న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : కృష్ణాజిల్లా ఫార్మా మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీ ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో షుగర్, బీపీ, నేత్ర, దంత, డైటీషియన్ పరీక్షలు నిర్వహిస్తారని కష్ణాజిల్లా ఫార్మా మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులురవీంద్రనాథ్ రెడ్డి ఓ ప్రకటనలో తెలియచేశారు . డయాబెటీస్ రోగులకు డాక్టర్ మోహన్ డయాబెటిస్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. వన్ టౌన్ స్టీల్ ప్యాలెస్ లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నిర్మాణ పరికరాలలో వోల్వో కన్‌స్ట్రక్షన్ అగ్రగామి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అతి పెద్ద నిర్మాణ పరికరాల కార్యక్రమం ఎక్స్‌కాన్ 2025లో వోల్వో కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ మౌలిక సదుపాయాల పరిణామంలో ప్రదర్శన ఏర్పాటు చేసిందని సంస్థ ప్రతినిధి ఎం.రాజకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రీకత ఇంజనీరింగ్, స్థిరత్వం ఆధారిత పరిష్కారాలను హైలైట్ చేసిందన్నారు. వోల్వో కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ దేశ తదుపరి నిర్మాణ, మైనింగ్, మెటీరియల్-హ్యాండ్లింగ్ వద్ధికి శక్తినిచ్చేలా రూపొందించిన ఉత్పత్తులు, సేవల సూట్‌ను ఆవిష్కరించిందని తెలిపారు. భారతదేశాన్ని హదయ స్థానంలో ఉంచుకుని నిర్వహించిన ప్రదర్శనలో వైవిధ్యమైన, డిమాండ్ ఉన్న పని వాతావరణాల కోసం రూపొందించబడిన సరికొత్త ఈసీ215, మేడ్ ఇన్ భారత్ ఎక్స్‌కవేటర్ పనితీరును ప్రదర్శించారని తెలిపారు.

వీఎంసిని మోడల్ సిటీగా తీర్చిదిద్దాలి : మేయర్

ప్రజాశక్తి- విజయవాడ సిటీ : పర్యావరణాన్ని పరిరక్షించాలంటే మనలో పరివర్తన రావాలని, ప్రతి ఒక్కరూ తమతోపాటు క్లాత్ బ్యాగ్ వెంట తీసుకొని బజారుకు వెళ్లాలని విజయవాడ నగరపాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం చిట్టినగర్ జోనల్ వన్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో మేయర్ భాగ్య లక్ష్మి, వీఎంసి కమిషనర్ ధ్యాన చంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించుకోవాలంటే మన వంతు సహాయంగా ప్రతి ఒక్కరు తమ ఇళ్లల్లో మొక్కలను నాటాలని, మిద్దెతోటల పట్ల అభిరుచి పెంపోదించుకోవాలని అన్నారు. వీఎంసి కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ రాబోయే తరానికి మనం ఇవ్వగలిగే ఆస్తి ప్రకతి వనరులన్నారు, పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ని నిషేధిస్తూ, సుస్థిరత్వం సాధించడంలో విజయవాడ నగరపాలక సంస్థను ఒక మోడల్ గా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగా, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్



ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, ప్రాజెక్ట్ ఆఫీసర్ పి. వెంకటనారాయణ, జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జై శ్రీనివాస్ అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ సిబ్బంది పాల్గొన్నారు.

సృజనాత్మకతే విజయానికి పునాది

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ఎంచుకున్న రంగంలో విజయం సాధించాలనే తపనతో పాటు తమలోని సృజనాత్మకతను విభిన్నరీతిలో ఆచరణలోకి తీసుకువచ్చినప్పుడు అద్భుత మైన విజయాలు సాధించవచ్చని విట్ (ఆంధ్రప్రదేశ్) యూనివర్సిటీ ఇంక్యుబేషన్



సెంటర్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ప్రొఫెసర్ అమిత్ చావన్ అన్నారు. కెబిఎన్ కళాశాల కామర్స్ అండ్ మేనేజ్మెంట్ విభాగం ఆధ్వర్యాన శనివారం కాన్ఫుయెన్షియా 2కె 25 (జాతీయస్థాయి స్టూడెంట్ మీట్) వేడుకగా జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అమిత్ మాట్లాడుతూ విజయాలు సాధించడానికి అడ్డదారులు ఉండవని, విభిన్నమైన పద్ధతుల్లో ప్రయత్నించాలని విద్యార్థులకు సూచించారు. అడ్డంకుల్ని ఎదుర్కొంటూ ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగాలన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి జి.కష్ణన్ మాట్లాడుతూ యువతరం ఉద్యోగం కోరుకునే దశ నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ యువతలో అద్భుతమైన శక్తిసామర్థ్యాలు ఉన్నాయని, వాటిని చక్కటి ప్రణాళికతో అమలు చేయాలని సూచించారు. కళాశాల కార్యదర్శి డాక్టర్ టి.శ్రీనివాసు మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాల కోసం ఎదురుచూడకుండా, అవకాశాలను సష్టించుకునే దిశగా దృష్టి సారించాలన్నారు. కళాశాల కమిటీ అధ్యక్షుడు ఉసిరిక ఉమామహేశ్వరరావు, కోశాధికారి ఎం.వి.కె.హరగోపాల్, హిందూ హైస్కూల్స్ కమిటీ పరిపాలనాధికారి డాక్టర్ వి.నారాయణరావు, కామర్స్ విభాగాధిపతి ఎ.హేమంత్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వికలాంగునికి చైర్ పంపిణీ

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : విజయవాడ ఎంపీ కేసినేని శివనాథ్ చిన్ని ఆదేశాలతో 47వ డివిజన్ కుండలమార్కెట్ నివాసి పైల సత్యనారాయణకు శనివారం ఫోల్డింగ్ చైర్ పంపిణి చేశారు. ఇటీవల పశ్చిమ నియోజకవర్గం కార్యాలయం వద్ద జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పైల సత్యనారాయణ కుటుంబ సభ్యులు ఎంపీ చిన్నిని కలసి ఫోల్డ్ చైర్ కొరకు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఎంపీ 47 వ డివిజన్ నేతల ద్వారా భాదితునికి ఫోల్డ్ చైర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో 46, 47వ డివిజన్ టీడీపీ అధ్యక్షులు పోతినీడు లోకేష్, నాగోతి రామారావు, తెలుగు యువత పశ్చిమ అధ్యక్షుడు రాళ్లపూడి మాధవ, కట్టా సాంబయ్య, ముడుకుపూడి కోటేశ్వరరావు, గూడేల ఉమా మహేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని బి కన్వెన్షన్ హాల్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీపీ (రూరల్) బి.లక్ష్మీనారాయణ, జగ్గయ్యపేట టౌన్ సీఐ పి.వెంకటేశ్వర్లు, ఎస్ఐ జి.రాజు, ఎస్ఐ-2 శంకర్ నాయక్ హాజరయ్యారు. ఈ గ్రామ సభలో ప్రజలకు సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్ట్ మోసాలు గురించి అవగాహన కల్పించారు. ఎలాంటి అనుమానాస్పద కాల్స్‌కు స్పందించకుండా, వ్యక్తిగత సమాచారం ఎవరికీ ఇవ్వకూడదని సూచించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణపై మాట్లాడుతూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిన అవసరాన్ని వివరించారు.

ఎన్‌టిటిపిఎస్‌కు స్టేట్ ఎనర్జీ కన్సర్వేషన్ అవార్డు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: విజయవాడలోని హోటల్ వివాంత్‌లో శనివారం స్టేట్ ఎనర్జీ కన్సర్వేషన్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. థర్మల్ ప్లాంట్లలలో శక్తి వినియోగాన్ని తగ్గిస్తూ, వినూత్నమైన ఎనర్జీ



కన్సర్వేషన్ విధానాలను ఉత్తమంగా అమలు చేసిన సంస్థలకు ఈ అవార్డులు ప్రదానం చేయబడతాయి. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన స్టేట్ ఎనర్జీ కన్సర్వేషన్ అవార్డుల్లో డాక్టర్ ఎటిటిపియస్ ద్వితీయ స్థానం సాధించి సిల్వర్ మెడల్‌ను పొందినట్లు ఎన్‌టిటిపిఎస్ అధికారులు తెలిపారు.



49వ డివిజన్లో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : కూటమి ప్రభుత్వం పిలుపుమేరకు 49వ డివిజన్ మట్టా లాజరస్ స్కూల్ ప్రాంగణం లో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 49వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు బడుగు వెంకన్న మాట్లాడుతూ లాజారస్ స్కూల్ హెచ్‌ఎం, టీచర్స్ నడిగి స్కూల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకోవడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం లాజరస్ కార్పొరేషన్ స్కూల్ అభివద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డి ప్రభుదాస్, బేవర జోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు .

ఉపాధి హామీకి గాంధీ పేరు కొనసాగించాలి

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరును తొలగించడం సరైనది కాదని, ఆ పథకంలో గాంధీ పేరును కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వానికి సీనియర్ రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్త ఆకుల శ్రీనివాస్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. మహాత్మా గాంధీని గౌరవించుకోవడం దేశ ప్రజలందరి అభిమతమని ఆయన పేర్కొన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద ప్రస్తుతం ఉన్న 100 రోజుల పని దినాలను 125 రోజులకు పెంచడం అభినందనీయమని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకాన్ని గతంలో వలనే యధావిధిగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

క్రీడల్లో శిక్షణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

క్రీడలు చాలాకాలంగా సామాజిక పురోగతికి శక్తివంతమైన మాధ్యమంగా నిలిచాయని, శామ్‌సంగ్ క్రీడలకు ప్రాధాన్యత ఇస్తుందని సంస్థ ప్రతినిధి ఎస్.రాజేష్ అన్నారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. శామ్‌సంగ్ ఫ్లాగ్‌షిప్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ శామ్‌సంగ్ సాల్వ్ ఫర్ టుమారో 2025 కార్యక్రమం ద్వారా వివిధ అంశాలలో శిక్షణ ఇస్తుందన్నారు. క్రీడలు, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సామాజిక మార్పు అనే ఇతివృత్తంతో దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు ఈ పిలుపుకు స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా క్రీడల్లో ప్రాప్యత, చేరికకు వారు కొత్త ద్వారాలను తెరిచారన్నారు. వివరాలకు శాంసంగ్ సాల్వ్ టు మారో ద్వారా తెలుసుకోవచ్చని అన్నారు.

పారిశ్రామిక పథకాలపై అవగాహన అవసరం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ : వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త స్ఫూర్తితో అందుబాటులో ఉన్న పారిశ్రామిక పథకాలు, కార్యక్రమాలను యువత సద్వినియోగం చేసుకునేలా అవగాహన పెంపొందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన



ఇగ్నైట్ సెల్‌ను కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. యువత పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అందుబాటులో ఉన్న అవకాశాలతో పాటు పీఎంఈజీపీ, పారిశ్రామిక అభివృద్ధి విధానం (2024-29), పీఎం విశ్వకర్మ యోజన, ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వల్ల కలిగే ప్రయోజనాలు, ఆర్‌టీఐహెచ్ తదితరాలపై రూపొందించిన ప్రచార సామగ్రిని పరిశీలించారు. ఇగ్నైట్ సెల్‌లో ప్రదర్శించిన నాలుగు ఎంఎస్ఎంఇల ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా జిల్లాను పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దేందుకు అమలు చేస్తున్న కార్యక్రమాల్లో నిరంతర ప్రగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి ఎం.మధు, ఏడీ ఎస్.బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ చట్టం నిర్వీర్యానికి ప్రభుత్వం కుట్ర

● పలుచోట్ల నూతన జీవో ప్రతుల దగ్ధం


చల్లపల్లిలో...

ప్రజాశక్తి-చల్లపల్లి : ఉపాధి హామీ చట్టం పీక నొక్కుతూ కేంద్ర ప్రభుత్వం తెస్తున్న 2025 ఉపాధి బిల్లును వ్యతిరేకిస్తూ స్థానిక బస్ స్టేషన్ సమీపంలో సిఐటియు, ప్రజాసంఘాల సంయుక్త ఆధ్వర్యంలో బిల్లు ప్రతులను శనివారం దగ్ధం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథి ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి యద్దనపూడి మధు, కల్లుగీత సంఘం రాష్ట్ర అధ్యక్షులు వాకా రామచంద్రరావు వాకా రామచంద్రరావులు మాట్లాడుతూ వ్యవసాయ సంక్షోభాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామీణ పేదలకు పట్టెడు అన్నం పెట్టడానికి వామపక్షాలు పోరాడి సాధించిన చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో పెట్టిన 2025 ఉపాధి హామీలను ఉపసంహరిం చుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు మండల కన్వీనర్ మహమ్మద్ కరీముల్లా, చల్లపల్లి టు రైతు నాయకులు నంద్యాల ప్రభు, గోళ్ళ సాంబశివరావు, బళ్లా వెంకటేశ్వరరావు, సిఐటియు మండల నాయకులు కుంభా కోటేశ్వరరావు, లింగం శెట్టి పూర్ణచంద్రరావు, సంసోను, సాలా శివకూర్ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మొవ్వ :** మొవ్వ మండల కేంద్రంలో సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టంలో తీసుకొచ్చిన మార్పులకు సంబంధించిన బిల్లు ప్రతులను ప్రజాసం ఘాల నాయకులు దగ్ధం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శీలం నారాయణరావు, సిఐటియు మండల కన్వీనర్ కొడాలి శ్రీనివాసరావు, మండల నాయకులు చిగురుపల్లి సుబ్రహ్మణ్యం ,రైతు సంఘం నాయకులు బొల్లా సుబ్రహ్మణ్యేశ్వర రావు వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు కొడాలి కరుణాకరావు, కాటా ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు శీలం కాటయ్య, ఉపాధి హామీ కార్మికులు కె. వెంకటరత్నం, నాగేంద్రం, శీలం రాంబాబు, నాంచారయ్య, కేసాని ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల తహసిల్దార్ కే మస్తాన్ కి వినతి పత్రం అందజేశారు. **ప్రజాశక్తి-ఘంటసాల :** కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఉపాధి హామీ చట్టంలో తీసుకువచ్చిన మార్పులను తక్షణమే ఉపసంహరిం చుకోవాలని సీపీఎం సీనియర్ నాయకులు వాకా రామచంద్రరావు డిమాండ్ చేశారు. శనివారం ఘంటసాల సెంటర్లో ఉపాధి హామీ చట్ట సవరణలను వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సవరణ బిల్లు ప్రతులను నాయకులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ గతంలో కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి 90 శాతం నిధులు ఇచ్చేదని, ఇప్పుడు దానిని 60 శాతానికి తగ్గించి రాష్ట్రాలపై 40 శాతం భారం మోపడం దారుణమని విమర్శించారు. **ప్రజాశక్తి-గన్నవరం (ఉంగుటూరు) :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరుమార్చడంపై ప్రజాసంఘాల ఆధ్వర్యంలో డిప్యూటీ తాసిల్దార్ చిట్టిబాబుకు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు, కౌలు రైతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.వి. లక్ష్మణస్వామి, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి ఎస్.కె.యం. సలీం, సిఐటియు మండల కార్యదర్శి కే. రామరాజు, వెన్నూతల సర్పంచ్ టి.వి. రామ్మోహన రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉంగుటూరు కెనరా బ్యాంక్ సెంటర్ వద్ద, బీసీ కాలనీలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లు ప్రతులను తగలబెట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పవన్ కుమార్, గ్రామస్తులు భవాని, లక్ష్మీ, దుర్గ, నరసమ్మ, తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.


మొవ్వలో...


ఉంగుటూరులో వినతిపత్రం అందిస్తున్న దృశ్యం


ఘంటసాలలో...

అలాగే ఉంగుటూరు బీసీ కాలనీలో శనివారం సాయంత్రం జీఓ కాపీలు దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో వ్వవసాయ కార్మక సంఘం జిల్లా కార్యదర్శి పి పవన్ కుమార్, వెంకటేశ్వరరావు, స్థానికులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తోట్లవల్లూరు :** వల్లూరు పాలెం సిపిఎం గామ శాఖ ఆధ్వర్యంలో జీవో పత్రాలను శనివారం దగ్ధం చేశారు. సిపిఎం నాయకులు కంభం కొండల బాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జుజ్జువరపు ఏసోబు, రైతు నాయకులు ఈడుపుగంటి డేవిడ్ రాజు, కాసింబాబు, ఏమినేని లెనిన్ బాబు, అంబటి శ్రీనివాసరావు, సింహాద్రి రాంబాబు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి :** మండలంలోని ములపర్రు గ్రామంలో బిల్లు కాపీలను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో మెట్లు గౌరిశెట్టి రామాంజనేయులు గౌరిశెట్టి సురేష్ బాబు, గౌరిశెట్టి రమేష్, కృష్ణాజిల్లా రైతుసంఘం కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు, సుంకర నాగమల్లేశ్వరరావు, గౌరిశెట్టి గోపి, వాసన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'ముస్తాబు' కార్యక్రమం పరిశీలన



ప్రజాశక్తి -కలక్టరేట్ (కృష్ణా) : స్థానిక ప్రభుత్వ రాంజీ హైస్కూల్‌ను జిల్లా విద్యాశాఖాధికారి యువి. సుబ్బారావు శనివారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల వ్యక్తి గత పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు అమలు చేస్తున్న ముస్తాబు కార్యక్రమం తీరును ఆయన పరిశీలించారు. అలాగే మధ్యాహ్న భోజన పథకం అమలుపై ఆరా తీసి, భోజన నాణ్యత, పంపిణీ విధానంపై వివరాలు తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలును సమీక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యాస ఫలితాలను పరిశీలించిన డీఈఓ, అసెస్మెంట్ పుస్తకాలు, నోట్‌బుక్‌ల దిద్దుబాట్లు, ఇతర అకడమిక్ రికార్డులను తనిఖీ చేశారు. ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థుల ఫలితాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచనలు జారీ చేశారు.



నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి గ్రామంలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన బల్లా వేణు కుమార్, మౌనిక రూ.50,000 నెల్లి భాను సూర్యప్రకాష్ నిహారిక రూ.50,000, దాసరి రాజేష్ రెడ్డి పావనిలు రూ.50,000 రూపాయలు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఆలయ కార్యనిర్వాహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావుకు శనివారం అందజేశారు. దాతలను అధికారులు ఆలయ మర్యాదలతో సత్కరించారు. అలాగే సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని శనివారం పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణప్రసాద్ దర్శించు కున్నారు. తొలత స్వామి వారి నాగపట్టలో పాలు పోసి సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు స్వామివారి చిత్రపటం ప్రసాదాలు అందజేశారు

కూచిపూడి నాట్య కళాపీఠం సందర్శన

ప్రజాశక్తి-మొవ్వ : దేశ విదేశాలలో పేరు ప్రఖ్యాతలు పొందిన కూచిపూడి గడ్డపై నడిచి విద్యార్థుల నాట్యాన్ని తిలకించటం తన పూర్వజన్మ సుకృతంం అని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం మోహన్ కుమార్ రవీంద్రనాథ్ ఠాగూర్ నాయర్(కేరళ) పేర్కొన్నారు. కూచిపూడి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖను శనివారం పరిశీలించి ఆయన శ్రీ సిద్దేంద్ర యోగి కూచిపూడి నాట్య కళా పీఠాన్ని సందర్శించారు. ఈ సందరరేగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు ద్వారా నాట్య సేవలు అందించిన నాటి నేటితర కళాకారుల విశేషాలను తిలకించికళాపీఠంలో ఏర్పాటుచేసిన ఫోటోలను పరిశీలించారు. ఆయనతోపాటు బ్రాంచ్ మేనేజర్లు వీరంకి జ్యోతి (కూచిపూడి), కొంపెల్ల అవధానులు (విజయవాడ), టి శ్రీనివాసులు (మచిలీపట్నం), డిప్యూటీ మేనేజర్జి వెంకటేశ్వరరావు (విజయవాడ) కళా పీఠం తరపున అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు పాల్గొన్నారు.


డీజీఎంను సత్కరిస్తున్న దృశ్యం



స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని కవుతరం కానూరి దామోదరయ్య జిల్లా పరిషత్ హై స్కూల్ లోని పదవ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు యుటిఎఫ్ కార్యదర్శి ఏవి వరలక్ష్మి ఆర్థిక సహకారంతో సబ్జెక్ట్ ఎక్సుర్ట్సచే రూపొందించిన యుటిఎఫ్ ప్రచురించిన మోడల్ టెస్ట్ పేపర్ ని శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల యూటీఎఫ్ అధ్యక్షులు డీవీఎం రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కె వెంకట్రావు , శివకుమార్, మురళీకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రజిని , ఉపాధ్యాయులు మూర్తి, టి రాజా, ఇర్ఫాన్, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎపిఎన్‌జిఒ మచిలీపట్నం నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రజాశక్తి-కలక్టరేట్ (కష్ణా) : ఏపీ ఎన్జీ జీవో మచిలీపట్నం తాలూకా యూనిట్ అధ్యక్ష కార్యదర్శులుగా చలమలశెట్టి లక్ష్మీ శ్రీనివాస్ ,చాపరాల శ్రీధర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి బి వెంకటేశ్వ రరావు తెలిపారు. స్థానిక ఏపీ ఎన్జీవో అసోసియేషన్ కన్వెన్షన్ హాల్ లో శనివారం జరిగిన ఎన్నికల్లో చలమలశెట్టి లక్ష్మీ శ్రీనివాస్, చాపరాల శ్రీధర్ ప్యానల్ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. అసోసియేట్ అధ్యక్షుడిగా జె.రాధాకష్ణ ఉపాధ్యక్షులుగా లీలా కృష్ణ, పి డి వి. అరవింద్, పి. భాస్కర్, టి. నాగభూషణం ,మహిళా విభాగం ఉపాధ్యక్షు రాలుగా కె. స్వర్ణలత ఎన్నికయ్యారు. ఆర్గనైజింగ్ కార్యదర్శిగా.జి చెన్నకేశవ రావు, సంయుక్త కార్యదర్శిగా వి దీపక్, కే ప్రవీణ్ కుమార్, ఎం క్రాంతి కుమార్, ఏ రమేష్, ఎం జితేంద్ర మరియు ఉమెన్ సంయుక్త కార్యదర్శిగా కే అనిత కోశాధికారిగా ఎస్ వి సందీప్ ఎన్నిక య్యారు. ఈ ఎన్నికకు అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్‌గా .ఎం శ్రీనివాసరావు, పరిశీలకునుగా సునీల్ కుమార్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా అధ్యక్షులు ఆకూరి శ్రీనివాస్ రావు , కార్యదర్శి ఏ.వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉల్లి కృష్ణ , అగ్రికల్చర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి సాయికుమార్, రవాణా శాఖ జోన్ 2 అధ్యక్షులు పి రాజబాబు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆర్ హేమ ప్రకాష్, ట్రెజరర్ ఏ జాషువా జయకర్ , జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ కుమార్ , కోటేశ్వరావు , సంయుక్త కార్యదర్శి రమేష్, కె రజిని, జాస్మిన్, ఇతర సంఘ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఘనంగా సత్కరించారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లిలోని విజయ క్రాంతి జూనియర్, డిగ్రీ కళాశాలలో సెమీ-క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ క్రిస్మస్ వేడుకలలో ఇండియా విలేజ్ మినిస్టర్స్ డైరెక్టర్ వేములపల్లి సురేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం క్రిస్మస్ సందేశం అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసే సాంస్కృతిక ప్రదర్శనలలో ఉత్సాహంగా పాల్గొని పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ దుట్టా శివరామ ప్రసాద్ పదేవేక్షణలో జరిగిన వేడుకలలో అధ్యాపక బృందం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి మచిలీపట్నం అర్బన్ :** సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం మచిలీపట్నం ఆర్కే కాలేజీ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్కే కళాశాలల అధినేత బండి రామకష్ణ, ఎల్‌సిఎఫ్ చర్చ్ నిర్వహకులు టీ. ప్రభాకర్, మచిలీపట్నం బార్ అసోసి యేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ శాయన సుశీలరావు, దైవ సేవకులు ఎం. ఏసు పాదం, జాన్ కెనడి, గౌరీ శంకర్, ప్రభాకర్ ప్రేమ రాజ్, కళాశాల ప్రిన్సిపాల్ డి. శివరామకష్ణ హాజర య్యారు. సెమీ క్రిస్మస్ భారీ కేకును బండి రామకృష్ణ దంపతులు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


విజయక్రాంతి కళాశాలలో...




బందరులో మాట్లాడుతున్న బండి రామకృష్ణ

వృద్ధాలను విలువైన వనరులుగా మారుద్దాం

- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో కలెక్టర్ జి.లక్ష్మీశ

ప్రజాశక్తి- నందిగామ : వ్యర్థాలను సరైన ఆలోచన, కార్యాచరణతో విలువైన వనరులుగా మార్చడం ద్వారా సర్క్యులర్ ఎకానమీతో ఆర్థికంగా, సామాజికంగా, పర్యావరణం పరంగా బహుముఖ ప్రయోజనాలు ఉంటాయని జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా నందిగామ మునిసిపాలిటీ పరిధిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ.. స్థానిక ప్రజాప్రతినిధులు, సమన్వయ శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. మొక్కలు నాటిన అనంతరం బిసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వివిధ కార్యక్రమాల్లో వారిని భాగస్వాములను చేసే ఉద్దేశంతో ప్రతినెలా మూడో శనివారం ప్రత్యేక థీమ్‌తో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యర్థాలను సరైన విధంగా నిర్వహించడం ద్వారా సర్క్యులర్ ఎకానమీకి బాటలు వేయొచ్చని.. చెత్త నుంచి సంపద సృష్టి



కేంద్రాల ద్వారా వస్తున్న ఫలితాలు ఇందుకు ఉదాహరణలు అని తెలిపారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర ఏ 2047 సాకారానికి ముందడుగుగా ప్రతిఒక్కరూ స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్రకు కృషిచేయాల్సిన అవసరముందని.. ప్రకృతి వ్యవసాయం, జల వనరుల సంరక్షణ, పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వడం, ప్లాస్టిక్ వస్తువుల వినియోగానికి దూరంగా ఉండటం తదితరాల వల్ల భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని బహుమతిగా అందించేందుకు వీలవుతుందన్నారు. 33 శాతం హరిత విస్తీర్ణం ఉండాలని, అయితే జిల్లాలో ఇది 25 శాతం ఉందని, ఇందుకోసం గ్రామాల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకెళ్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలని ర్యాలీ



ప్రజాశక్తి-కంచికచర్ల : పోలియో రహిత సమాజం కోసం 5 ఏళ్ల లోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఎంపిడిఓ డి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం కంచికచర్లలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి మధురిమ మాట్లాడుతూ కంచికచర్ల మండల పరిధి లోని 3645 మంది కి 0 -5 పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యం గా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో హెల్త్ సూపరవైజర్ జి వి రాఘవేంద్ర రావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్స్ పోలియో ప్రచార పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఈ నెల 21న నిర్వహించనున్న పోలియో దేను ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం ఆయన తన కార్యాలయంలో పోలియో డే ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో షేక్ కాసిం, వేదులపూరి సైదా, ముత్తవరపు వెంకటేష్, వంగూరి కోటేశ్వరరావు, షేక్ భాషా, కారుపాటి ఏసుబాబు, కారుపాటి వెంకయ్య (చిలక), షేక్ సుభాని, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. పల్స్ పోలియోను విజయవంతం చేయాలని కోరుతూ జగ్గయ్యపేట ప్రభుత్వ హాస్పిటల్ ఆధ్వర్యంలో డాక్టర్ కె.వాసంతి పిపి యూనిట్ మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శైలా, సూపర్ వైజర్ జానకీలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పిల్లలకు మూడు రోజుల పాటు జరిగే పోలియో చుక్కలను వేయించాలని తెలిపారు.

దారి సమస్య పరిష్కారానికి వినతి



ప్రజాశక్తి జి కొండూరు : మండలంలోని కుంట ముక్కల గ్రామంలో రాజకీయ పలుకుబడితో తమ పొలాలకు వెళ్లకుండా గారికి ఫెన్సింగ్ వేశారని.. దానివల్ల 22 కుటుంబాలకు సంబంధించిన తామంతా ఇబ్బంది పడుతున్నామని, వెంటనే సమస్య పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీశాకు, డిస్ట్రిక్ రెవెన్యూ ఆఫీసర్ లక్ష్మీ నరసింహకు సిపిఎం ఆధ్వర్యంలో శనివారం రైతులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రెవిన్యూ ఆఫీసర్ లక్ష్మీనరసింహ మాట్లాడుతూ కలెక్టర్ గారికి రైతులు సమస్యను వివరించి సమస్య పరిష్కారమయ్యే విధంగా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల వీరాంజనేయులు మరియు కుంటముక్కల బాడవ రోడ్డు పోరాట కమిటీ రైతులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం

ప్రజాశక్తి – తిరువూరు

వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని వైసిపి తిరువూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నల్లగట్ల స్వామిదాస్, వైసిపి సోషల్ మీడియా విభాగం ఆధ్వర్యంలో శనివారం మెగా రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించారు. విజయవాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి చెందిన వైద్య సిబ్బంది రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో స్వామిదాసుతో పాటు నియోజవర్గ స్థాయి నాయకులు ఎం.సూర్యనారాయణరెడ్డి, యరమల రామచంద్రారెడ్డి, తాళ్లూరు నవీన్, కాలసాని నాగేశ్వరరావు, తదితరులు పాల్గొ న్నారు.

ఎడ్లబండ్ల రైతులు పేర్లు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు : రంగుల మహోత్సవం సందర్భంగా గ్రామంలో వేంచేసియున్న శ్రీ గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారితో పాటు సహదేవతల విగ్రహాలను జనవరి 5న రంగుల నుంచి పేట రంగుల మండపం వరకు తీసుకు వెళ్లేందుకు ఆసక్తిగల ఏడ్లు బండ్లు కలిగిన రైతులు స్థానిక పోలీస్ స్టేషన్లో పేర్లను నమోదు చేసుకోవాలని ఆలయ ఈవో బి మహేశ్వరరెడ్డి తెలిపారు. రైతులు తమ పేర్లను ఈ నెల 22 నుంచి 23వ తేదీ ఆరు గంటలలోపు చేసుకోవాలని తెలిపారు. నమోదు చేసుకున్న పేర్లు 24న ఉదయం 11 గంటలకు పోలీస్ స్టేషన్ ఆవరణలో రైతుల సమక్షంలో లాటరీ ద్వారా 11 బండ్లను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఆంధ్రప్రదేశ్ నాన్-గెజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్స్ జగ్గయ్యపేట సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం నివాసంలో సంఘం నూతన కార్యవర్గ సభ్యులు రఘురాంను మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన ఆరేపల్లి కుమార్, ప్రధాన కార్యదర్శి ఎ.బాబు రావు, అలాగే నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఇతర కార్యవర్గ సభ్యులను నెట్టెం రఘురాం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన కార్యవర్గం నాయకత్వంలో జగ్గయ్యపేట అధికారుల సంఘం మరింత చురుకుగా పనిచేసి, ఉద్యోగుల సంక్షేమంతో పాటు ప్రజా ప్రయోజనాలకు కూడా గణనీయమైన దోహదం చేస్తుందని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు.

విద్య ద్వారానే సమగ్రాభివృద్ధి



ప్రజాశక్తి -మైలవరం: విద్య ద్వారానే సమగ్ర అభివృద్ధి జరుగుతుందని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి పని ధర్మార్టి అన్నారు. స్థానిక లీలావతి గిరిజన పాఠశాలను శనివారం సందర్శించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదల క్రమశిక్షణ ఉంటే ఏదైనా సాధించవచ్చు అన్నారు. వెనుకబడిన విద్యార్థుల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యులు ఉడత లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కాలుష్యాన్ని నిర్మూలించండి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి – తిరువూరు

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని వాతావరణ కాలుష్యాన్ని నిర్మూలించాలని రెవెన్యూ డివిజనల్ అధికారిణి (ఆర్డీఓ) కె.మాధురి పేర్కొన్నారు. తిరువూరు నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం పర్యావరణ పరిరక్షణ సచివాలయ ఉద్యోగులకు, పారిశుధ్య కార్మికులకు కమిషనర్ మనోజ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మనం వాడిన వస్తువులపై వృధాగా పడేయడం వల్ల వాతావరణం కలుషితమై దెబ్బ తింటుందని, ఫలితంగా భూతాపం పెరగటం, వర్షాలు కురవకపోవటం వంటి ప్రమాదకరమైన పరిస్థితులు ఏర్పడతాయన్నారు. కాబట్టి ప్రతి



ఒక్కరు పర్యావరణ ప్రాముఖ్యత గురించి ప్రజలకు వివరించాలని తెలిపారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-వత్సవాయి : మండలంలోని చిట్యాల గ్రామాల ఎంపీపీ పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఉచిత వైద్య నిర్వాహకులు మారెళ్ళ పుల్లారెడ్డి, మారెళ్ళ సూరారెడ్డి తెలిపారు. ఈ కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కాకాని శంకర్ కంటి ఆసుపత్రి సిబ్బంది వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు.

స్వామిత్వ సర్వేపై శిక్షణ

ప్రజాశక్తి – ఇబ్రహీంపట్నం: సొంత రెవిన్యూ మీద, స్వామిత్వ సర్వేలపై శనివారం శిక్షణ కార్యక్రమం ఇబ్రహీంపట్నం ఎంపిడివో కార్యాలయంలో జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమానికి పంచాయతీ సెక్రెటరీ గ్రేడ్ 1పై పంచాయతీ సెక్రటరీ డిజిటల్స్ అసిస్టెంట్ విఆర్ఓ విలేజ్ సర్వేయర్లు హాజరయ్యారు. కార్యక్రమానికి టివోటిగా ఎంపీడీవో డి శకుంతల, వి ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో జి ఎస్ డబ్ల్యూ ఎస్ టిఓటిలుగా వ్యవహరించారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి – తిరువూరు : తిరువూరు ఐడియా సేవా సంస్థ ప్రాంగణంలో వృద్ధులకు శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. తిరువూరు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో చలికి వణకుతూ ఇబ్బందులు పడుతున్న 60 మంది పేద వద్దులను గుర్తించిన ఐడియా సేవా సంస్థ వారికి మండల విద్యా శాఖ అధికారి అలగం శ్యాంసుందర్, మాజీ సర్పంచ్ ఉయ్యూరు అన సూయ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర దేవాలయం చైర్మన్ పర్వతం శ్రీనివాసరావు, సంస్థ డైరెక్టర్ అవ్వారి శౌరి, మేనేజర్ అవ్వారి అంతయ్య పాల్గొన్నారు.

బాలికపై బాలుడు అత్యాచారం

ప్రజాశక్తి-వత్సవాయి : ఆరేళ్ల బాలికపై ఓ బాలుడు (14) అత్యాచారం చేసిన సంఘటన మండలంలో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల గ్రామానికి చెందిన ఓ బాలుడు అదే గ్రామానికి చెందిన బాలిక (దివ్యాంగురాలు)ను ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ బాలిక కేకలు వేయటంతో బాలుడు అక్కడ నుండి పరారయ్యాడు. బాలికకు తీవ్ర రక్త స్రావం కావడంతో కుటుంబ సభ్యులు జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్య నిమిత్తం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జెఆర్‌సి కళాశాల ప్రిన్సిపాల్‌కు సతీవియోగం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: సుదీర్ఘ కాలంగా జగ్గయ్యపేటలో కామర్స్ అధ్యాపకుడిగా, ప్రిన్సిపాల్‌గా విద్యా రంగానికి అంకితమై సేవలందించిన జూటూరి వెంకటేశ్వర్లు (అబ్బులు)కు సతీవియోగం కలిగింది. వెంకటేశ్వర్లు భార్య సుజాత శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. సుజాత మృతి విషయం తెలిసిన వెంటనే ఆమె భౌతికకాయాన్ని విద్యా యాజమాన్య ప్రముఖులు, ప్రిన్సిపాల్స్ సందర్శించి నివాళులర్పించారు. అబ్బులును పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో శ్రీరాం సుబ్బారావు, రంగాపురం నరసింహారావు, పెనుగొండ వెంకట రాజీవ్, కొమరగిరి పద్మ శేఖర్, దుర్గాప్రసాద్, కొల్లా నాగరమేష్ తదితరులు ఉన్నారు.

డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నందిగామ : ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ 2026 డైరీని నందిగామ 16 అదనపు జిల్లా న్యాయమూర్తి పి.శ్రీనివాసరావు శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మన్నెం నారాయణరావు బొండలపాటి రామకృష్ణ షేక్ కరిముల్లా బండి మల్లికార్జునరావు, మట్ట ప్రసాద్, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, కొనకంచి శ్రీనివాసరావు, మంద వజ్రయ్య కొమ్మినేని మౌలేశ్వరరావు, వేల్పుల స్వామి, యరగని వీరబాబు, వేల్పుల కిషోర్, షేక్ అజాద్, తదితరులు పాల్గొన్నారు.



మైలవరంలో నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు



వీరులపాడులో నిరసన తెలుపుతున్న నేతలు

ఉపాధి హామీ పేరు మార్పుపై నిరసనలు

ప్రజాశక్తి-మైలవరం : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకుందామంటూ మైలవరంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ సుధాకర్, మండల కమిటీ సభ్యులు పి జ్యోతి, రైతు సంఘం మండల కార్యదర్శి వజ్రాల వెంకటరెడ్డి, ఐలు నాయకులు రమేష్ బాబు వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు లంక వెంకటేశ్వరరావు, గురజాల రామారావు, సిఐటియు మండల కమిటీ నాయకులు ఇసాక్, రమణ దుర్గ వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వీరులపాడు : ఉపాధి హామీని నిర్వీర్యం చేసే బిల్లును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో వీరులపాడు మండలం వీరులపాడు గ్రామంలో నిరసన తెలిపారు. అనంతరం ఉపాధి హామీ చట్టం ఏ.పి.ఓ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి చాట్ల రవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు తొలగిస్తూ విబిజిరామ్‌జి అనే పేరు తీసుకురావడం దుర్మార్గమని తెలిపారు. పేదల పథకాన్ని పెద్దలకు దోచి పెట్టడం కోసం సంస్కరణలను బిజెపి తీసుకొస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు వట్టి కొండ పార్థసారథి, భాగీరథి, గడ్డం ప్రభాకర్, బాణావత్. రఘుపతి కోదండం చేకూరి బుజ్జి పాల్గొన్నారు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

- 'స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర'లో వక్తలు



బందరులో చెత్తను ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను సామాజిక బాధ్యతగా పాటించి, ప్లాస్టిక్ వాడకం తగ్గించుకుని పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ కలెక్టోరేట్లో జరిగిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. కలెక్టరేట్లో వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు కార్యాలయపు సిబ్బందితో కలిసి జిల్లా కలెక్టర్ స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా కలక్టర్ కార్యాలయ ఆవరణలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి శనివారం మాదిరిగానే ఈసారి కూడా జిల్లా కలెక్టర్ తన క్యాంపు కార్యాలయం నుండి సిబ్బందితో కలిసి కలెక్టరేట్కు సైకిల్ పై వచ్చి అందరిలోనూ స్ఫూర్తి నింపారు. ఈసారి కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ స్వయంగా ట్రాక్టర్ ని నడిపారు. డిఆర్ఓ కే చంద్రశేఖర రావు,జిల్లా పశుసంవర్ధక అధికారి చిన్న నరసింహులు, వయోజన విద్య ఏడి బేగ్, జిల్లా పర్యాటక అధికారి రామ్ లక్ష్మణ్, జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనందకుమార్, గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి పోతురాజు, బీసీ కార్పొరేషన్ ఈడీ రాజేంద్ర బాబు, సమాచార శాఖ డిడి యమ్. వెంకటేశ్వర ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణనే లక్ష్యం : డిఎంహెచ్ఓ

పర్యావరణ పరిరక్షణతో పాటు ఉపాధి అవకాశాల సృష్టే లక్ష్యమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాదికారి పి. యుగంధర్ తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం డీఎంహెచ్ఓ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డిసెంబర్-2025 థీమ్గా నిర్ణయించిన పర్యావరణంలో అవకాశాలు అంశంపై డిఎంహెచ్ఓ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో చెత్తను ఊడ్చి పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ కార్యాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ :** వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని జిల్లా పంచా యతీ అధికారి డా. జె. అరుణ పేర్కొన్నారు. స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం మండల పరిధిలోని చిన్నాపురం గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీపీఓ డా.జె అరుణ గ్రామంలో గుర్రపు డెక్కతో తయారు చేస్తున్న జూట్ బ్యాగుల తయారీ విధానాన్ని పరిశీలించారు. మాజీ ఎం పి పి కాగిత వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ సి హెచ్ వెంకటేష్, డిప్యూటీ ఎంపిడివో బాలకృష్ణారావు, గ్రామ సర్పంచ్ కాగిత గోపాలరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మొవ్వ :** మొవ్వ మండలంలోని పీఎం శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యానికి అనుగుణంగా స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్రగా తీర్చిదిద్దామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు నిమ్మగడ్డ ఉమాశ్రీ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేసి ప్లే కార్డ్స్ చేతబూని నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. **ప్రజాశక్తి-కోడూరు :** కోడూరు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సచివాలయ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది కలిసి ప్రతిజ్ఞ చేశారు. కోడూరు గ్రామపంచాయతీ కార్యదర్శి పి మల్లికార్జునరావు, సచివాలయ కార్యదర్శులు మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** ఎఎఎన్ఎమ్అండ్ వివిఆర్ఎస్ఆర్ పాఠశాలలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి శనివారం ముఖ్య అతిథిగా గుడ్లవల్లేరు ఎంఈఓ జి.గోపాలరావు పాల్గొని ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందంర్భంగా భారీ ర్యాలీని నిర్వహించారు. గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజ్ ఎన్.ఎస్.ఎస్ ఆఫీసర్, డాక్టర్ నవీన్, హైస్కూల్ ప్రిన్సిపాల్ వి.ఎ.కుంజుమన్, వైస్ ప్రిన్సిపల్ జిఎం సత్యబాబు, డైరెక్టర్ ఎన్.శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** పెనమలూరు నియోజకవర్గం పెద్దపులిపాక గ్రామంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరు ఇంటి నుండి చెత్తను పొడి, తడి చెత్తలను విడివిడిగా అందించి సహకరించాలన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.



కంకిపాడులో...



గుడ్లవల్లేరులో...

సైన్స్ ఫెయిర్లో జెడ్పి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మొవ్వ : కృష్ణాజిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్లో నిర్వహించిన వృత్తి అంశాలలో మొవ్వ పిఎం శ్రీ శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి వెళ్లిన రెండు అంశాలకు బహుమతి లభించి రాష్ట్రస్థాయికి ఎంపికైయ్యాయి. ఈ విషయాన్ని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిమ్మగడ్డ ఉమాశ్రీ స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ పోటీలు మచిలీపట్నంలోని టీటీడీ కళ్యాణ మండపంలో శనివారం నిర్వహించారు. ఎలక్ట్రానిక్స్, హార్డ్వేర్ అంశానికి మొదటి బహుమతి లబించగా పెర్ఫార్మెన్స్ ఫస్ట్ ప్రైజ్ డాక్టర్ థీమ్ కు లభించింది. వీరికి కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ నవీన్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** శనివారం మచిలీపట్నంలో నిర్వహించిన కృష్ణా జిల్లా కెరీర్ ఫెస్టోలో మండలంలోని కానూరి దామోదరయ్య జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు టూరిజం అండ్ హాస్పిటాలిటీ అంశాన్ని ఎంపిక చేసుకుని జిల్లా స్థాయిలో మొదటి బహుమతి సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు ఎన్. రాజని కుమారి తెలిపారు. ఈ విజయానికి ఓకేషనల్ ట్రైనర్లు రుక్మిణి, శ్రీనివాస్రావు విద్యార్థులకు ఇచ్చిన సరైన మార్గనిర్దేశం ప్రధాన కారణంమని పేర్కొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపుదలకు కెరీర్ ఎక్స్పో దోహదం

సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు వారి కెరీర్పై అవగాహన కల్పించేందుకు కెరీర్ ఎక్స్పో వంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆర్. కుముదినిసింగ్ తెలిపారు. ఎస్ఎస్ఎ ఆధ్వర్యంలో శనివారం స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో జిల్లా స్థాయి కెరీర్ ఎక్స్పో ఎగ్జిబిషన్ నిర్వహించారు. కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి యువి. సుబ్బారావు, అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కుముదిని సింగ్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా కుముదిని సింగ్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ కెరీర్కు సరైన దిశానిర్దేశం చేయాలనే లక్ష్యంతో ఈ ఎక్స్పోను నిర్వహించినట్లు తెలిపారు. ఈ నెల 15 నుంచి 18 తేదీల వరకు 193 పాఠశాలల స్థాయిలో నిర్వహించిన కెరీర్ ఎక్స్పోలలో నుంచి మండలస్థాయిలో ఎంపికైన 125 పాఠశాలల ఐదు ఉత్తమ కెరీర్ మోడల్స్ను జిల్లా స్థాయిలో ప్రదర్శించినట్లు చెప్పారు. విద్య, విజ్ఞానం, సాంకేతికత, వత్తి అవకాశాలకు సంబంధించిన వివిధ ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించి వివరణ ఇచ్చారన్నారు. ఉత్తమ ప్రాజెక్ట్స్ ప్రదర్శించిన తొమ్మిది టీములకు బహుమతులు అందాచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్బిఐ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ జోనల్ మేనేజర్ ఆర్.వి. హనుమంతరావు, కోటక్ మహీంద్రా బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ సుధీర్ కుమార్, వైజాగ్ పాలిటెక్నిక్ కాలేజ్ మెకానికల్ ట్రేడ్ డాక్టర్ టి. నాంచారయ్య, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : ప్రభుత్వ బడ్జెట్లో కళాకారుల పెన్షన్లకు, పోగ్రాములకు నిధులు కేటాయించకపోవడం బాధాకరమని నంది అవార్డు గ్రహీత ముత్యాల ఎసుబాబు అన్నారు. తమ జీవితాన్ని రంగస్థలానికి అంకితం చేసిన కళాకారులను ప్రోత్సహించవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉండాలన్నారు. శనివారం మచిలీపట్నం మహతి కళా వేదిక లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీనియర్ రంగస్థల కళాకారులు ఏలేశ్వరపు పూర్ణచంద్రరావు, తూమాటి రాజేశ్వరరావు, దశిక రమేష్ లను శ్రీ కళాంజలి థియేటర్ తరఫున సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. డిపో మేనేజర్ టీ. పెద్దిరాజు, మచిలీపట్నం రంగ స్థల కళాకారులు సంఘము పూర్వ అధ్యక్షులు చలమలశెట్టి గాంధీ, ప్రముఖ నటులు టి. రాజేశ్వరరావు పాల్గొన్నారు.

వెంకట సుబ్బారావుకు నివాళి

ప్రజాశక్తి-అవనిగడ్డ : విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు తిమ్మన చెంచు వెంకట సుబ్బారావుకు ప్రముఖ పారిశ్రామికవేత్త, కూటమి నాయకులు విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు నివాళులర్పించారు. వెంకట సుబ్బారావు శుక్రవారం అవనిగడ్డ లోని ఒకటో వార్డులో మరణించగా విషయం తెలుసుకున్న శ్రీనివాస్ ఉదయం వెంకట సుబ్బారావు స్వగ హానికి వెళ్లి నివాళులర్పించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా ఇరిగేషన్ శాఖలో ఏఈగా పని చేస్తున్న పులిగడ్డ వెంకటేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో శనివారం వెంకటేశ్వరరావు స్వగ్రామం పులిగడ్డ వెళ్లి శ్రీనివాసరావు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆయన చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకటేశ్వర తండ్రి నాగేశ్వరావు తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు పులిగడ్డ పిచ్చే శ్వరరావు, గ్రామ మాజీ సర్పంచ్ దాస్ హాజీ బాబు, విక్కుర్తి. రాంబాబు, న్యాయవాది విక్కు ర్తి. రామకృష్ణ, పులిగడ్డ చంద్ర, భూపతి నాంచారయ్య, రేపల్లె ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.



పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ (లచ్చి) పుట్టినరోజు వేడుకలు పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. శనివారం మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జడ్పిటిసి చేత కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాష, పార్టీ నియోజకవర్గ యూత్ కన్వీనర్ చింతలపూడి బాలు, మండల పార్టీ ఉపాధ్యక్షులు గార్లపాటి గోపి, పార్టీ నాయకులు గరికపాటి వెంకటకృష్ణారావు, సింహాద్రి శివాజీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ పిడి పోతురాజు

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - పెదపారుపూడి : మండలంలో గృహనిర్మాణాలు వేగవంతం చేయడానికి అధికారులు కృషి చేయాలని గృహనిర్మాణ సంస్థ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్ పోతురాజు ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీడీవో ఛాంబర్లో ఆయన మాట్లాడుతూ గతంలో ఇంటిని నిర్మించుకోవడానికి రూ.1,80,000లు ప్రభుత్వాలు అందించేవన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అదనంగా కలుపుకుని ఎస్టీలకు రూ.2,55,000లు, ఎస్సి, బిసిలకు రూ.2,30,000లు ప్రభుత్వ అనుమతి పొందిన గృహ నిర్మాణ లబ్దిదారులకు అందిస్తుందన్నారు. కాబట్టి 2026 మార్చి నెలాఖరులోపు గృహనిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విమాదేవి, హౌసింగ్ డిఇ ఎస్ ప్రసాదరావు, హౌసింగ్ ఎఇ ఫణీంద్ర, వర్క్ ఇనస్పెక్టర్ ఎ నాగేంద్రబాబు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల ఆదాయం పెంచాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-పమిడిముక్కల : పంచాయతీలకు సొంత వనరుల ద్వారా ఆదాయాన్ని కల్పించాలని ఎంపిడిఒ సీతారామరాజు అన్నారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీల ఆదాయం పెంచడంపై కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, కార్యదర్శి స్వామి, విజయదుర్గ తదితరులు పాల్గొన్నారు

దేవరకోట - కొడాలి రహదారి నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-ఘంటసాల : ప్రధా న రహదా రుల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. శనివారం ఘంట సాల మండలం దేవరకోటలో స్టేట్ హైవే ప్లాన్ నిధులు రూ.5కోట్లతో



దేవరకోట నుండి కొడాలి వరకు 4 కిలోమీటర్ల మేర నిర్మించనున్న తారు రోడ్డు పనులకు ఆయన భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూకూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రాధాన్యత క్రమంలో 23 ఆర్.అండ్.బీ రహదారులకు రూ.9.49 కోట్లతో మరమ్మతులు చేయించినట్లు వివరించారు. ఇప్పటికే కోడూరు రోడ్డు, టీ.కొత్తపాలెం-గుల్లలమోద (రూ.2.50 కోట్లు), వక్కపట్లవారిపాలెం ఓఎన్జీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేశామని, కోడూరు - ఊటగుండం పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, టీడీపీ మండల అధ్యక్షులు తుమ్మల చౌదరిబాబు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకష్ణ, డీసీ చైర్మన్ అయినపూడి భానుప్రకాష్, జనసేన మండల అధ్యక్షుడు కోన రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ సమావేశం వాయిదా

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ తుంగల సుమతీదేవి తెలిపారు. శనివారం జరగవలసిన సమావేశం మండల పరిధిలోని వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు అంతా హాజరైనప్పటికీ, పాలకవర్గ సభ్యులు వారి మధ్య ఉన్న సమస్యలు చర్చించుకుంటూ ఉండటంతో సాయంత్రం 4.30 గంటలకు వరకు సమావేశం ప్రారంభం కాకపోవడంతో సభను మరో రోజుకు వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ ప్రకటించారు. ఎంపీడీవో తమకు సమావేశం ఏజెండా ఇవ్వలేదని పాలక మండలి సభ్యులు ఆరోపణ చేస్తున్నారు.

గ్రామీణ పేదల ఉపాధికి గండం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్జిఎస్)లో కేంద్రం తీసుకొచ్చిన మార్పులు గ్రామీణ పేదల ఉపాధికి గండంగా మారుతోందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకు ఉన్న చట్టాన్ని కాస్తా వికసిత భారత గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజ్వీత మిషన్ (గ్రామీణ్) విబిజిరాంజి పథకంగా మార్చేసింది. కార్మికులకు హక్కుగా ఉన్న చట్టాన్ని తొలగించి ప్రభుత్వ దయాదాక్షిన్యాలపై కార్మికులు ఆధారపడేలా పథకంగా మార్చేసింది. మరోపక్క రోజువారీ వేతనాల్లో కోత పెట్టింది. దీంతో జిల్లాలో ఉపాధి పనులకు వెళ్ళే లక్షలాది వ్యవసాయ కార్మికుల వేతనాల్లో కోత పడనుంది. ఆ మేరకు ఆదాయాలు కోల్పోనున్నారు.

ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాల వినియోగం పెరగడంతో గ్రామీణ ప్రాంతాల్లో కార్మికుల పని దినాలు తగ్గిపోతున్నాయి. వ్యవసాయ ప్రాధాన్యత గలిగిన కృష్ణా జిల్లాలో ఎక్కువ మంది ఉపాధి పనులకు వెళుతున్నారు. 2,17,538 జాబ్ కార్డులున్న కుటుంబాలకు సంబంధించి 3,81,935 కార్మికులు ఉపాధి పనులకు వెళుతున్నారు. కేంద్రం రోజు వేతనాన్ని రూ.307గా నిర్ణయించగా పనిని బట్టి సగటున రూ.281.34 వేతనం పొందుతున్నారు. తాజాగా ఉపాధి వేతనాన్ని రూ.240 ప్రభుత్వం కుదించింది. ఈ



మేరకు ఉపాధి కార్మికుల ఆదాయం కుదించకుపోనుంది. మరో పక్క ఏడాదిలో 60 రోజులు ఉపాధి పనికి సీలింగ్ పెట్టింది. దీంతో సగటు పనిదినాలు తగ్గిపోయే పరిస్థితి ఉంది.

గత కొన్నేళ్ల నుండీ కేంద్రం ఉపాధి చట్టాన్ని నీరుగార్చే కుట్రలు చేస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. దీనిలో భాగంగానే జిల్లాలో ఉపాధి పనులు చేసిన కార్మికులకు సకాలంలో వేతనాలు జమచేయడం లేదని కార్మికులు వాపోతున్నారు. జులైలో పనులు చేసిన కార్మికులకు ఇప్పటికీ రూ.3 కోట్ల 25 లక్షలు చెల్లించాల్సి ఉంది. తాజాగా ఈ చట్టాన్ని తొలగించి పథకంగా మార్చడం, రాష్ట్ర ప్రభుత్వాల వాటాను 10 శాతం నుండీ 40 శాతానికి పెంచడం తదితర అంశాలు కార్మికుల ఉపాధికి గండంగా మారనున్నాయి.

పంచాయతీల హక్కులపై దాడి

ఉపాధి హామీ చట్టంలో చేయాల్సిన పనులపై గ్రామ పంచాయతీల ఆమోదం తీసుకోవాల్సి ఉంటుంది. పంచాయతీల్లో అవసరమైన అభివృద్ధి, మౌలిక వసతుల పనులు ఉపాధి చట్టంలో ఇప్పటి వరకు ఎక్కువుగా చేశారు. ప్రస్తుతం తీసుకువచ్చిన పథకంలో పంచాయతీల్లో నిర్వహించాల్సిన పనులను కేంద్రమే నిర్ణయిస్తుంది. ఈ పరిస్థితుల్లో స్థానిక సంస్థల అధికారాలు కుదించుకుపోతాయని జిల్లాలోని 497 గ్రామపంచాయతీ పాలకవర్గాలు వాపోతున్నాయి.

డిఎస్ఆర్‌వి ప్రసాద్ డిఎస్ఆర్‌వి ప్రసాద్

అంగన్‌వాడీలకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జగ్గయ్యపేట శాసన సభ్యులు శ్రీరాం రాజ గోపాల్ (తాతయ్య) తెలిపారు. ఆ లక్ష్యంతోనే అంగన్వాడీ వ్యవస్థలో స్మార్ట్ టెక్నాలజీని ప్రవేశపెట్టినట్లు ఆయన పేర్కొన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గ వ్యాప్తంగా పనిచేస్తున్న 278 మంది ఐసీడీఎస్ సిబ్బందికి ప్రభుత్వం స్మార్ట్ ఫోన్లను అందజేస్తోందని తెలిపారు. శనివారం పట్టణంలోని ఉక్కు కళా వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తాతయ్య ఐసీడీఎస్ సిబ్బందికి స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లెల సీతమ్మ, మున్సిపల్ కమిషనర్ తులసి కృష్ణారావు, పోచంపల్లి సొసైటీ చైర్మన్ ముల్లంగి రామకష్ణారెడ్డి, గౌరవరం సొసైటీ చైర్మన్ కట్టా వెంకట నరసింహారావు, తక్కెళ్ళపాడు సర్పంచ్ కస్తూర్తి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



మాస్టర్ మైండ్స్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు

- వంద మంది దైవ సేవకులకు సత్కారం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : మాస్టర్ మైండ్స్ స్కూల్స్ విజయవాడ ఆధ్వర్యంలో శనివారం పాయకాపురంలోని స్కూల్ ఆవరణలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రిస్మస్ గీతాలు విశేషంగా అలరించాయి. వేడుకలలో భాగంగా వంద మంది దైవ సేవకులకు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా మాస్టర్ మైండ్స్ స్కూల్స్ చైర్మన్ డాక్టర్ పి.అనిల్‌కుమార్ మాట్లాడుతూ క్రిస్మస్ అంటే యేసు క్రీస్తు జన్మ దినోత్సవాన్ని గుర్తు చేసుకుంటూ ప్రేమ, శాంతి, సంతోషాన్ని పంచుకోవడమని తెలిపారు. పేదలకు సేవ చేయడం కూడా క్రిస్మస్ పండుగ ప్రత్యేకత అన్నారు. అందుకే మాస్టర్ మైండ్స్ స్కూల్స్ వంద మంది సేవకులను సత్కరించినట్లు తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక సేవ, నైతిక విలువలను బోధిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ మణి కంట పాఠశాల ఉపాధ్యాయులు, తల్లి దండ్రులకు విద్యార్థులు పాల్గొన్నారు.





శారదలో వినూత్నంగా మాక్ అసెంబ్లీ

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

భారత రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ హక్కులు పాఠశాల స్థాయి నుండే విద్యార్థులు అలవరచుకోవాలి శారద ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి కుందా రామ నారాయణ అన్నారు. గాంధీనగర్‌లోని శారద హైస్కూల్‌లో 'మాక్ అసెంబ్లీ' శనివారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇటీవల అమరావతి ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీ ప్రాంగణంలో నిర్వహించిన మాక్ అసెంబ్లీ విజయవంతమైన సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో తమ పాఠశాలలో నిర్వహించినట్లు తెలిపారు. శారద హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎ.ఎల్. ఎన్.మూర్తి మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ హక్కులు, శాసన ప్రక్రియ పై విద్యార్థులు అవగాహన పెంచుకొని భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా, ఉత్తమ నాయకులుగా ఎదగడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

- గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు సదా భార్గవి

ప్రజాశక్తి-విజయవాడ : పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని గిరిజన సంక్షేమశాఖ రాష్ట్ర సంచాలకులు సదా భార్గవి అన్నారు. మండల కేంద్రమైన ఎ.కొండూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో శనివారం "ముస్తాబు" కార్యక్రమాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు. విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రత, క్రమశిక్షణ, శారీరక ఆరోగ్యాన్ని అభివృద్ధి చేసేందుకు ముస్తాబు కార్యక్రమం దోహదం చేస్తుందని అన్నారు. సిఎం చంద్రబాబు ఆకాంక్షల మేరకు రాష్ట్రంలోని 558 గిరిజన సంక్షేమ విద్యా సంస్థలలో శనివారం నుంచి ముస్తాబు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. విద్యార్థుల తల వెంట్రుక నుంచి కాలి గోటి వరకు ప్రతి నిత్యం పరిశీలించి, పాఠశాలలోకి చిన్నారులను అనుమతిస్తామని చెప్పారు. అనంతరం విద్య శిక్షణతో పాటు యోగ, ఆటపాటలకు తద్వారా సంపూర్ణ ఆరోగ్యానికి "ముస్తాబు" ద్వారా కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమానికి సంబంధించిన ప్రతిజ్ఞ ఈ సందర్భంగా చేయించారు.



ముస్తాబు కార్నర్, ముస్తాబు పోస్టర్స్‌ను సంచాలకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి యం.ఫణి ధూర్జటి, ఎ కొండూరు ఎంపిడిఒ బి శ్రీనివాసరావు, ఎంఇఒ కేశవరావు, పాఠశాల హెచ్.యం జి కవిత, ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు, గిరిజన సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. అంతరం ఆశ్రమ పాఠశాలఉ సంచాలకులు వారు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తరగతిలోని విద్యార్థులతో విద్యా సంబంధిత అంశాల ప్రగతిని, ఉపాధ్యాయులు బోధనా తీరును పరిశీలించారు. వసతి గృహం, భోజనశాల, వంట గది, వండిన ఆహారాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. హాస్టల్‌కు సంబంధించి పలు సూచనలు చేశారు.

నేడూ విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు: ఎస్ఇ

ప్రజాశక్తి-విజయవాడ : ఈ నెల 21న ఆదివారం సెలవు అయిన్నప్పటికీ జిల్లాలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో విద్యుత్ బిల్లులు వసూలు కేంద్రాలు యథావిధిగా పని చేస్తాయని, వినియోగదారులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఎపిసిపిడిసిఎల్ విజయవాడ ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ యు.హనుమయ్య కోరారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ... నేరుగా ఇంటి వద్ద నుంచే విద్యుత్ బిల్లులు చెల్లించే సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఎపిసిపిడిసిఎల్ కస్టమర్ యాప్ ద్వారా ఇంటి వద్ద నుంచే విద్యుత్ సర్వీసు నెంబర్‌ను యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని విద్యుత్ బిల్లులను చెల్లించవచ్చని తెలిపారు. అదే కాకుండా ఇతర గూగుల్ పే, ఫోన్ పే, అమెజాన్ పే, బిల్ డెస్క్, యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లులను చెల్లించవచ్చని ఎస్ఇ హనుమయ్య తెలిపారు.





క్రీడలకు సమయం కేటాయించాలి

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : క్రీడలలో రాణించిన వారికి ప్రభుత్వ పరంగా అనేక ప్రోత్సాహకాలు ఉన్నాయని, ప్రతి విద్యార్థి పాఠశాల స్థాయి నుండే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యాన చంద్ర అన్నారు. నగరంలోని బ్లూమింగ్ డేల్ ఇంటర్నేషనల్ స్కూల్ స్పోర్ట్స్ మీట్ -2025 శనివారం సాయంత్రం పాఠశాలలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు అవసరమని, తల్లి దండ్రులకు తమ పిల్లలను క్రీడలపై కూడా ఆసక్తి కలిగించే విధంగా చూడాలని అన్నారు. పాఠశాల స్థాయి నుండే క్రీడలపై ఆసక్తి పెంచుకొని మంచి క్రీడాకారులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. సభకు అధ్యక్షత వహించిన స్కూల్ ప్రిన్సిపాల్ హర్ సిమ్రాన్ కౌర్ మాట్లాడుతూ బ్లూమింగ్ డేల్ స్కూల్ విద్యతో పాటు విద్యార్థి సమగ్ర వ్యక్తిత్వం పెంపొందించేందుకు క్రీడలు, సాంస్కృతిక అంశాలపై. కూడా అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పద్మ లత, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రలో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: స్వర్ణాంధ్ర -2047 సంకల్పంలో భాగంగా శనివారం "స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమాన్ని పట్టణంలోని మార్కెట్ యార్డు ప్రాంగణంలో మార్కెట్ యార్డు చైర్మన్ మల్లెల సీతమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పాల్గొని యార్డు పరిసర ప్రాంతాలను శుభ్రపరిచారు. స్వచ్ఛత కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, జగ్గయ్యపేట ఎల్ ఎస్ సి ఎస్ చైర్మన్ ధూళిపాళ్ల లక్ష్మణరావు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ అడుసుమల్లి ప్రభాకర్, ఎఎస్ భాస్కరరావు, కౌన్సిలర్స్ కన్నెబోయిన రామలక్ష్మి, సంగెపు బుజ్జిబాబు, పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీల్లో గోహిత్ ప్రతిభ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని బలుసుపాడు "గురుదామ్" వ్యవస్థాపకులు శ్రీ శ్రీ శివానంద గురువు జన్మదినం సందర్భంగా జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) నేతృత్వంలో "బాలచైతన్య స్ఫూర్తి" ఆధ్వర్యంలో బాలుర ఉన్నత పాఠశాలలో జగ్గయ్యపేట నియోజకవర్గ స్థాయిలో జరిగిన వక్తత్వ పోటిల్లో పట్టణంలోని నాగార్జున హైస్కూల్ 10వ తరగతి విద్యార్థి ఎం. గోహిత్ 3వ బహుమతి సాధించారు. ఈ నెల 21న బలుసుపాడు గురుదామ్ నుంచి బహుమతి అందుకోనున్న సందర్భంగా నాగార్జున స్కూల్ యాజమాన్యం విద్యార్థిని అభినందించారు.

పత్తి కొనుగోలు చేయాలని వినతి

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ మార్కెట్ యార్డ్ ద్వారా పత్తి కొనుగోలు చేయాలని పత్తి రైతులు జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. శనివారం జిల్లా కలెక్టర్ లక్ష్మీశ నందిగామ వచ్చిన సందర్భంగా నందిగామ, అనాసాగరం తదితర గ్రామాల కు చెందిన పత్తి రైతులు కలిశారు. పత్తిని సిసిఐ సక్రమంగా కొనుగోలు చేయడం లేదని, దళారులు గ్రామాలలో తక్కువ ధరకు పత్తి కొంటున్నారని, గుడ్డి పత్తి కొనుగోలు చేయడం లేదని, ప్రభుత్వం తక్షణమే పత్తి కొనుగోలు చేయాలని కోరారు. తేమ శాతం తో సంబంధం లేకుండా పత్తి కొనుగోలు చేయాలని కోరారు. పత్తి కి కనీస మద్దతు ధర క్వింటా 8500 ఇవ్వాలని కోరారు. నందిగామ ఆర్డీవో బాలకష్ణ, తహశీల్దారు సురేష్, పలువురు రైతులు పాల్గొన్నారు

బడి బయట పిల్లల కోసం ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి పెనుగంచిప్రోలు : బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ఎంఇఒ రవీంద్రనాయక్ అన్నారు. స్థానిక తిరుపతమ్మ అమ్మవారి ఆలయ వద్ద బడి బయట పిల్లల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఆలయం వద్ద సంచరిస్తున్న బాలికలను గుర్తించి కౌన్సిలింగ్ ఇచ్చి స్థానిక ఎస్ఎస్‌పిఎం బాలికల జడ్పీ హైస్కూల్లో చేర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరూ తప్పక పాఠశాలలో ఉండాలన్నారు ఈ కార్యక్రమంలో విఆర్‌పిలు పాల్గొన్నారు.